శుక్రవారం
22-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 61
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం


## న్యాయవ్యవస్థ పునరుద్ధరిస్తాం: దిసనాయకె

**కొలంబో:** న్యాయవ్యవస్థను పునరుద్ధరిస్తామని శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకె ప్రకటించారు. ఎన్నికల హామీలు నెరవేరుస్తానన్నారు. నూతన ప్రభుత్వంతో గురువారం కొలువుదీరిన పార్లమెంటునుద్దేశించి దిసనాయకె ప్రసంగించారు. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) పార్టీ పొదుపు వాగ్దానానికి కట్టుబడి ఉంటానన్నారు. జవాబుదారీతనం ఉండేలా న్యాయ వ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థతో ఒప్పందాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆయనన్నారు.

# అడ్డంగా దొరికిన అదానీ

## అమెరికాలో లంచం, మోసం కేసు

- సోలార్ ప్రాజెక్టుల కోసం రూ.వేల కోట్ల ముడుపులు
- బ్యాంకులు, పెట్టుబడిదారులకూ టోకరా
- భారీ కుంభకోణంలో ఏడుగురిపై అభియోగాలు

**న్యూయార్క్/న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ అమెరికా ఇన్వెస్టర్లను మోసం చేశారని, ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చారని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) బట్టబయలు చేసింది. ఇందుకుగాను అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్, అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ సిరిల్ కబనాస్‌పై అభియోగాలు నమోదు చేసింది. మొత్తం ఏడుగురిని ఈ కేసులో నిందితులుగా చేర్చినట్టుగా తెలుస్తోంది. వైర్ మోసాలు, సెక్యూరిటీల మోసానికి పాల్పడేందుకు ఈ వ్యక్తులు కుట్ర పన్నారని ఎస్ఈసీ అభియోగాలు మోపింది. ఈ ఆరోపణలు బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టుకు సంబంధించినవి. అదానీ కంపెనీ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయడం ద్వారా అమెరికా ఇన్వెస్టర్లు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి నిధులు సేకరించిందని, అదానీ గ్రీన్, అజూర్ పవర్ సంస్థలకు భారత ప్రభుత్వం ఇచ్చిన బిలియన్ డాలర్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకునేందుకు ఈ లంచం ఇచ్చినట్టుగా ఎస్ఈసీ ఆరోపించింది. ఫెడరల్ సెక్యూరిటీస్ చట్టాల్లోని యాంటీ ఫ్రాడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఎస్ఈసీ ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఈసీ ప్రకటన ప్రకారం... ఈ కాంట్రాక్ట్ సమయంలో అదానీ గ్రీన్ యూఎస్ ఇన్వెస్టర్ల నుండి 175 మిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ.1,450 కోట్లు) సేకరించింది. మరోవైపు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అజూర్ పవర్ షేర్లు ట్రేడవుతున్నాయి. అదానీ గ్రీన్, అజూర్ పవర్‌తో సంబంధం ఉన్న గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, కాబనీస్, ఇతరులపై న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం క్రిమినల్ అభియోగాలు నమోదు చేసింది. ఫారిన్ కరప్షన్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)ను ఉల్లంఘించి లంచం ఇవ్వడానికి కుట్ర పన్నారనే అభియోగాలు ఉన్నాయి. 2020-24 మధ్య అదానీ, ఆయన సహచరులు భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లు (రూ.2,100 కోట్లు) పైగా లంచాలు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. లంచం ఇవ్వడం వెనుక ఉద్దేశం సోలార్ పవర్ ప్రాజెక్టులను దక్కించుకోవడమేనని అంటున్నారు. ఇది వచ్చే 20 ఏళ్లలో రెండు బిలియన్ డాలర్లకు పైగా లాభాలు ఆర్జించగలదని అంచనా. ఇక అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ పెట్టుబడిదారులు, రుణ దాతల నుంచి సుమారు మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లు సేకరించిందని అభియోగాలు ఉన్నాయి. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ప్రకారం అదానీ అమెరికా పెట్టుబడి దారులను మోసగించారని, అధికారులకు లంచాలు ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయి. అదానీతో పాటుగా ఆయనకు చెందిన కొందరు వ్యక్తులు ఇన్వెస్టర్లను మోసం చేశారని... అంతేకాకుండా దర్యాప్తును అడ్డుకునేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు నిందితులు

- మిగతా 2 లో

## అరెస్టు చేయాలి: రాహుల్

అధికారులకు మిలియన్ డాలర్ల కొద్దీ లంచం ఇవ్వడం, మోసానికి పాల్పడినట్లు అమెరికాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

2లో

## సంజయ్ మూర్తి ప్రమాణ స్వీకారం

### కాగ్ పదవి చేపట్టిన తొలి తెలుగు అధికారిగా ఘనత

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక నిఘా సంస్థ కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నూతన అధిపతిగా కొండ్రు సంజయ్ మూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంజయ్ మూర్తి చేత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,

- మిగతా 2 లో

## నెతన్యాహుపై ఐసీసీ అరెస్టు వారెంట్

**హేగ్:** ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆయనతోపాటు రక్షణశాఖ మాజీ మంత్రి యోఆవ్ గల్లాంట్‌పైనా వారెంట్ జారీ అయింది. గాజాలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక చర్యల ఆరోపణలపై ఈ ఇద్దరిపై ఐసీసీ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రధాని నెతన్యాహుతోపాటు మాజీ మంత్రి గల్లాంట్ గాజాలో హత్యలు, హింస, అమానవీయ చర్యలతోపాటు ఆకలిచావుల వంటి యుద్ధ నేరాలకు పాల్పడినట్లు ఐసీసీ ఆరోపించింది. అక్కడి

- మిగతా 2 లో

## ఉక్రెయిన్‌పై రష్యా ఖండాంతర క్షిపణి దాడి

**కీవ్:** రష్యా తొలిసారి ఉక్రెయిన్‌పై ఖండాంతర క్షిపణితో దాడి చేసింది. ఈ విషయాన్ని గురువారం కీవ్ వాయుసేన వెల్లడించింది. డెనిపర్ నగరంలోపై ఈ దాడి జరిగినట్లు పేర్కొంది. కచ్చితంగా ఏ రకం క్షిపణి ప్రయోగించారో మాత్రం వెల్లడించలేదు. దీంతోపాటు ఎక్స్-47ఎం2 కింజల్ బాలిస్టిక్ క్షిపణిని కూడా ప్రయోగించినట్లు తెలిపింది. మరోవైపు ఉక్రెయిన్ ఆరోపణలపై స్పందించేందుకు రష్యా నిరాకరించింది. దీనిపై చెప్పేందుకు ఏమీ లేదని క్రెమ్లిన్

- మిగతా 2 లో

## జేపీసీ విచారణ

### సీపీఐ డిమాండ్

### దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. అదానీ, అనుబంధ సంస్థలు 20 ఏళ్లలో రెండు బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి సరఫరా ఒప్పందాల కోసం 265 మిలియన్ డాలర్లు లంచం ఇస్తామని భారత ప్రభుత్వాధికారులకు ఆశ చూపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇదే క్రమంలో అమెరికాలో గౌతం అదానీ, ఆయన సహచరులపై కేసు నమోదైంది. తాజా పరిణామంపై సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదానీపై, ఆయన సంస్థలపై, ప్రధానితో బీజేపీతో సంబంధాలపై జేపీసీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అదానీ గ్రూపును వివాదాలు చుట్టుముట్టుతున్నాయని, వ్యాపారంలో అక్రమాలు పెరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని ప్రకటన నొక్కిచెప్పింది. నిష్పాక్షిక విచారణ జరగకపోతే ప్రజలను పణంగా పెట్టి అదానీ ప్రయోజనాలకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని స్పష్టమవుతుందని వ్యాఖ్యానించింది. అదానీ అక్రమాలపై విచారణకు డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రజలను, వారి అవసరాలను నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేయడమే బీజేపీ ఆశ్రిత పెట్టుబడిదారీ నమూనా అని విమర్శించింది. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేయాలని పార్టీ శ్రేణులకు సీపీఐ పిలుపునిచ్చింది.

# సమస్యల పరిష్కారానికే ముఖాముఖి

- విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి
- ప్రజాలోచనలకు అనుగుణంగా పాలన
- కులగణనపై దోపిడీదారుల తప్పుడు ప్రచారం
- హామీల అమలు ప్రభుత్వ విజయాలే: భట్టి

**విశాలాంధ్ర-హైదరాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారానికే ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో గురువారం ప్రజలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ... కాంగ్రెస్ భావజాలాన్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా పాలన సాగుతుందన్నారు. సమస్యలను క్షేత్రస్థాయి నుంచి తెలుసుకొని పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి పెట్టినట్టు చెప్పారు. ప్రపంచ స్థాయి విద్య పేద విద్యార్థులకు అందించేందుకు సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. నేటి బాలలే రేపటి భవిష్యత్తు అని క్యాబినెట్ ఆలోచనతో హాస్టల్ విద్యార్థుల 40 శాతం మెస్ ఛార్జీలు పెంచాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత పాలకులు పదేళ్లపాటు ఈ

- మిగతా 2 లో



## రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యం

- గతంలో చేశాం, ఇప్పుడూ చేసి చూపిస్తాం
- విశాఖ, తిరుపతి, కర్నూలు పట్టణాల అభివృద్ధి
- ఏపీ సీఎం చంద్రబాబు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ ఆమోదించిందని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. హైకోర్ట్ బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ గురువారం అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం చంద్రబాబు

- మిగతా 2 లో

## రాష్ట్రపతికి ఘన స్వాగతం

**విశాలాంధ్ర - హైదరాబాద్:** రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాష్ట్రానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి శామీర్ పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బొల్లారంలోని రాష్ట్రపతి నివాసానికి చేరుకుని అక్కడ ఎనిమిది రోజులపాటు నిర్వహించే ఈశాన్య రాష్ట్రాల భారతీయ కళా మహోత్సవంను ప్రారంభించారు. మినిస్టర్ ఇన్ వెయిటింగ్‌గా మంత్రి సీతక్కను రాష్ట్ర సర్కార్ నామినేట్ చేసింది. రాష్ట్రపతిని స్వాగతించడం మొదలు సాగనంపడం వరకు ముర్ము వెంట ఆమె ఉండనున్నారు.

# ఏపీలో మళ్లీ భారీ వర్షాలు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్రంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. రైతులు తక్షణమే వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివిధ జిల్లాలలో వరి కోతల సీజన్ ప్రారంభం కావడంతో ప్రత్యేకించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టంచేశారు. విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుండగా... ఈ ప్రభావంతో ఈనెల 23న

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

# మరో పది రోజులు అర్జీలు అందజేద్దాం

- నేతలకు రామకృష్ణ విజ్ఞప్తి
- ఇళ్ల స్థలాల కోసం సీపీఐ పోరుకు అనూహ్య స్పందన

**విశాలాంధ్ర-విజయవాడ:** పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ చేపట్టిన కార్యక్రమానికి లబ్ధిదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని, ఈ కార్యక్రమాన్ని మరో పది రోజులు కొనసాగిస్తామని, ఇంటి స్థలాల కోసం లబ్ధిదారులు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు ఇచ్చారు. సీపీఐ పట్టణ, నగర కార్యదర్శులతో రామకృష్ణ గురువారం జూమ్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యురాలు అక్కినేని వనజ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90 శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని చెప్పారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభైవేల డబ్బులు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలాచోట్ల ఇళ్ల స్థలాల లేఅవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు నివేశన

- మిగతా 2 లో

# విశాఖ ఉక్కుపై దద్దరిల్లిన మండలి

- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ
- ప్రైవేటీకరణ జరగనివ్వం: మంత్రుల స్పష్టీకరణ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చర్యలు చేపట్టాలన్న అంశంపై గురువారం శాసన మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పర వాగ్వివాదం చోటు చేసుకుంది. వాడివేడిగా చర్చ కొనసాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు వరుదు కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఈ వివాదం రేగింది. కల్యాణి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం నుంచి పెద్దఎత్తున

- మిగతా 2 లో

# సిరియాపై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు

## 68కి చేరిన మృతులు

**బీరుట్/డమాస్కస్:** సిరియాలోని పాల్మీయా నగరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. 68 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ గురువారం వెల్లడించింది. బుధవారం జరిగిన దాడుల్లో చనిపోయిన వారిలో 42 మంది ఇరాన్ అనుకూల సిరియా సంఘాలు, 26 మంది విదేశీయులు, నలుగురు హెజ్బుల్లాకు చెందిన సాయుధులు ఉన్నట్లు తెలిపింది. ఏడుగురు పౌరులు సహా 50 మందికిపైగా గాయపడటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. గాయపడిన ఏడుగురు పౌరుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నదని తెలిపింది.

**గాజాలో 15 మంది పలస్తీనియన్లు మృతి**

దక్షిణ, సెంట్రల్ గాజాలోని ఇజ్రాయిల్ రెండుసార్లు వైమానిక దాడులు జరుపగా 15 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ దాడులు కొనసాగాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌కు పశ్చిమాన ఉన్న అల్ మవాసీ ప్రాంతంలో గుడారాన్ని ఇజ్రాయిల్ యుద్ధ విమానం లక్ష్యం చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షి చెప్పినట్లు మీడియా తెలిపింది.

వైద్య సిబ్బంది, పిల్లలతో సహా ఏడుగురి మృతదేహాలు లభ్యం కాగా అనేక మందికి గాయాలయ్యాయని, వారిని ఆసుపత్రికి తరలించామని అధికారులు చెప్పారు. అల్ నుసీరత్ శరణార్థి శిబిరంలో అల్ అవ్దా ఆసుపత్రిలో ఎనిమిది మంది మరణించగా మరో 15 మందికి గాయాలైనట్లు వెల్లడించారు. 24 గంటల్లో ఉత్తర గాజా స్ట్రిప్‌లోని బెయిత్ లహియాలో ఫిరంగుల దాడులు భీకరంగా సాగినట్లు ప్రత్యక్ష సాక్షి చెప్పినట్లు జిన్హువా పేర్కొంది. గతేడాది నుంచి ఇప్పటివరకు ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 43,985 మంది చనిపోయారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది.

# ఉక్రెయిన్‌లో శాంతి, గాజాలో కాల్పుల విరమణ

## జిన్‌పింగ్, లులా పిలుపు

**బ్రసీలియా:** ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించాలని, గాజాలో కాల్పులు విరమించాలని చైనా, బ్రెజిల్ దేశాల అధ్యక్షుడు జిన్‌పింగ్, లులా డా సిల్వా ఉమ్మడిగా పిలుపునిచ్చారు. తమ దేశ రాజధాని బ్రసీలియాకు చేరుకున్న జిన్‌పింగ్‌కు లులా ఎర్ర తివాచీ పరిచి ఘనంగా స్వాగతం పలికారు.

సాయుధ ఘర్షణలు, రాజకీయ సంఘర్షణలతో ప్రపంచం అల్లాడిపోతోందన్నారు. శాంతి, దౌత్యం, సంప్రదింపులకు చైనా, బ్రెజిల్ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయని లులా అన్నారు. శాంతి సాధనకు కలిసి రావాలని ప్రపంచ దేశాలను జిన్‌పింగ్ కోరారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం దిశగా శాంతి పథానికి కట్టుబడాలని పిలుపునిచ్చారు. గాజాలో సాధ్యమైనంత త్వరగా దాడులు ఆపాలని, కాల్పులను విరమించాలన్నారు.

**గాజాపై ఐరాస తీర్మానం: వీటో చేసిన అమెరికా**

గాజాలో తక్షణమే, బేషరతుగా శాశ్వతంగా కాల్పులు విరమించాలని పిలుపునిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానించింది. దీనిపై ఓటింగ్ నిర్వహించగా బేషరతుగా ఒప్పుకునేది లేదంటూ అమెరికా అభ్యంతరం తెలిపింది. తమ మిత్రదేశం ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తూ వీటో అధికారాన్ని వినియోగించింది.

**చైనా-బ్రెజిల్ బంధం పటిష్ఠం**

బ్రసీలియాలో లులా డా సిల్వా ఇచ్చిన విందు సందర్భంగా బ్రెజిల్ ప్రజల ఆత్మీయ స్వాగతానికిగాను చైనా అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. లులా నాయకత్వంలో బ్రెజిల్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు. పరస్పర అవగాహన, స్నేహంతో భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నామన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చాలని లులా అన్నారని, తమ బంధం సాధించిన పురోగతి గర్వకారణమన్నారు.

ఉజ్వల భవిష్యత్‌పై ఆశలు పెట్టుకున్నట్లు చెప్పారు. లులా మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తూ ప్రపంచానికి మంచి ఉదాహరణను జిన్‌పింగ్ అందించారన్నారు. సామాజిక న్యాయం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చారని, యుద్ధానికి కాదని శాంతికి... ఘర్షణను కాదని సహకారానికి, విధ్వంసాన్ని కాదని సృష్టికి కట్టుబడ్డారని, దానినే ఉద్బోధించారని లులా డా సిల్వా చెప్పారు. జిన్‌పింగ్ నాయకత్వంలో చైనా సాధించిన విజయాలు, అభివృద్ధిని తాను ఎంతగానో అభిమానిస్తానని ముఖ్యంగా 100 మిలియన్ల మందిని పేదరికం నుంచి బయటకు తీయడం ప్రశంసనీయమన్నారు. 50ఏళ్ల కిందట తమ రెండు దేశాల మధ్య దౌత్య బంధం ఏర్పడిందని గుర్తుచేశారు. సంఘీభావం, సహకారం, ఇరు వర్గాలకు ప్రయోజనం ఉండే నమూనాను అనుసరించినట్లు తెలిపారు. బ్రెజిల్-చైనా కమ్యూనిటీ నిర్మాణానికి చైనాతో కలిసి పనిచేసేందుకు బ్రెజిల్ ఆసక్తిగా ఉన్నట్లు లులా చెప్పారు.

# ఆర్థిక సహకారం పెంచుకుందాం

## ఉ.కొరియా, రష్యా కొత్త ఒప్పందం

**ప్యాంగ్యాంగ్:** తమ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఉత్తర కొరియా, రష్యా దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ప్యాంగ్యాంగ్‌లో జరిగిన చర్చల సందర్భంగా కొత్త ఒప్పందం కుదిరినట్లు ఉత్తర కొరియా మీడియా గురువారం వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తమ ప్రతినిధుల బృందం పర్యటన సందర్భంగా ప్యాంగ్యాంగ్ సెంట్రల్ జూకు 70కుపైగా జంతువులు బహూకరించారు. ఇందులో సింహాలు, ఎలుకుబంట్లు, అరుదైన పక్షు జాతులు ఉన్నాయి. ఉత్తర కొరియా, రష్యా మధ్య బంధం మరింతగా బలోపేతం అవుతుండటానికి తాజా పరిణామాలు అద్దం పట్టాయి. ఇటీవల కాలంలో మాస్కోతో సంబంధాలకు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉక్రెయిన్‌లో పుతిన్ యుద్ధానికి మద్దతిస్తున్నారు. ఇదే క్రమంలో తమ సైన్యాన్ని రష్యాకు మద్దతుగా పంపించారు. ఈ చర్యను దక్షిణ కొరియా తీవ్రంగా ఖండించింది. ఉత్తర కొరియా దళాలు రష్యాలో మోహరించడం మానవత్వానికి వ్యతిరేకమైన నేరమని, మాస్కో దురాక్రమణలోకి దేశ యువతను చొప్పించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని దక్షిణ కొరియా రక్షణశాఖ సహాయ మంత్రి కిమ్ సియోన్ హో అన్నారు. ఆయన ఈ మేరకు లావోస్‌లో జరిగిన ఏషియన్ రక్షణ మంత్రుల సదస్సులో ఆందోళన వ్యక్తంచేశారు. అయితే ఉత్తర కొరియా ఇప్పటికే 11వేల మందికిపైగా సైనికులను రష్యాకు పంపినట్లు దక్షిణ కొరియా చెబుతోంది. కాగా రష్యాకు సైనిక సాయంపై కిమ్ ఇప్పటివరకు ఏ ప్రకటన చేయలేదు.

# సంజయ్ మూర్తి ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తదితరులు హాజరయ్యారు. ఇక ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్‌మూర్తి అరుదైన ఘనత సాధించారు. ఇప్పటి వరకు కాగ్ అధిపతిగా ఉన్న గిరీశ్ చంద్ర ముర్మ పదవీ కాలం ఈ నెల 20తో ముగిసింది. దీంతో తదుపరి కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తిని రాష్ట్రపతి ఈనెల 18న నియమించారు. కాగా, అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి కుమారుడే సంజయ్‌మూర్తి. కేఎస్ఆర్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరపున అమలాపురం నుంచి లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. అంతకుముందు ఆయన కూడా ఐఏఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో సేవలందించారు. 1964 డిసెంబరు 24న జన్మించిన సంజయ్... మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. 1989లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారిగా హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో క్రియాశీలక పాత్ర పోషించారు. ఐఏఎస్ అధికారిగా ఆయన వచ్చే నెలలోనే ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించిన కేంద్రం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ స్థానంలో నియమితులైనవారు గరిష్ఠంగా ఆరేళ్లు కానీ, 65 ఏళ్ల వయసు వరకు కానీ కొనసాగడానికి వీలుంది.

# నెతన్యాహుపై ఐసీసీ అరెస్టు వారెంట్

(మొదటిపేజీ తరువాయి)

పౌరులకు ఆహారం, నీరు, ఔషధాల సరఫరాపై ఆంక్షలు విధించారని పేర్కొంది. తద్వారా మానవ సంక్షోభం తీవ్రమవడంతోపాటు మరణాలకు దారితీసిందని తెలిపింది. ఎంతోమంది చిన్నారులు బాధితులుగా మారారని, అక్కడి పౌరులను లక్ష్యంగా చేసుకున్నారనేందుకు తగినన్ని ఆధారాలు గుర్తించామని ఐసీసీ తెలిపింది.

# ఏపీలో మళ్లీ భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందన్న అంచనాలు ఉన్నాయని సిసోడియా తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఫలితంగా ఈనెల 24వ తేదీ నుంచి అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని సిసోడియా పేర్కొన్నారు.

# మరో పది రోజులు అర్జీలు అందజేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

స్థలాలు కేటాయించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు.

ఈ నెల 18వ తేదీన సచివాలయాల్లో అర్జీలు సమర్పించేలా రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శ్రేణులు చేసిన కృషికి లబ్ధిదారుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ నాయకత్వం మరో పది రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని వెల్లడించారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన పేదల జాబితా రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులను భారీగా సమీకరించి... సచివాలయాల్లో అర్జీలు సమర్పించేలా సీపీఐ నాయకత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అర్జీలు రాయటం, వాటిని సచివాలయాల్లో సమర్పించేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందించే బాధ్యత పార్టీ పట్టణ, నగర నాయకత్వాలపై ఉందని స్పష్టంచేశారు. గ్రామాల్లో కంటే పట్టణాల్లో ఇళ్లులేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ఇళ్లు, ఇంటి స్థలాల లబ్ధిదారులను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి పట్టణ, నగర కార్యదర్శులు అక్కడి పరిస్థితిని రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్‌లో లబ్ధిదారులు భారీ ఎత్తున వ్యక్తిగత అర్జీలు సమర్పించేందుకు సమాయత్తమవుతున్నారని తెలిపారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కోడూరులో ఇప్పటికి 14 వందల మంది అర్జీలు సమర్పించారని, దాదాపు 4వేల పైచిలుకు అర్జీలు ఇవ్వడానికి కృషి చేస్తామని చెప్పారు. ఇతర జిల్లాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ చార్జీలపై చేసిన పోరాటానికి ప్రజలు మద్దతు పలికారని, ఇళ్ల స్థలాల కోసం జరిగే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావటానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య, పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి వై.చెంచయ్య పాల్గొన్నారు.

# అడ్డంగా దొరికిన అదాని

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించారని ఎఫ్‌బీఐ అసిస్టెంట్ డైరెక్టర్ జేమ్స్ డెన్నిహి తెలిపారు. ఈ కేసు ఇప్పుడు అమెరికాలో పెద్ద కార్పొరేట్ మోసం, అవినీతి కేసుగా మారిందని అధికారులు అంటున్నారు. భారత అధికారులకు లంచం ఇచ్చి అమెరికన్ ఇన్వెస్టర్లను మోసం చేసినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. అమెరికాలో నిధుల సమీకరణ కోసం 25 కోట్ల డాలర్లు(సుమారు రూ.2100 కోట్లు) లంచం ఇవ్వజూపారని, ఆ విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టారని గౌతమ్ అదానీపై అభియోగాలు నమోదయ్యాయి.

**'అదానీ గ్రూప్'పై అభియోగాలు ఇవే...**

సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఆమోదించేందుకు గౌతం అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు భారత్ లోని వివిధ రాష్ట్రాల అధికారులకు ముడుపులు ఇవ్వ జూపినట్లు ఆరోపణలు వచ్చాయి. గౌతం అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ సహా మరో ఏడుగురు అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లు వివిధ రాష్ట్రాల అధికారులకు సుమారు రూ.2,200 కోట్లు (265 మిలియన్ డాలర్లు) లంచాలు ఇవ్వజూపారని అమెరికా కోర్టులో కేసు నమోదైంది. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యంత ఖర్చుతో కూడుకున్న సౌర విద్యుత్ అంటగట్టేందుకు అదానీ గ్రూప్ ప్రతినిధులు ప్రయత్నించారని అమెరికాలో దాఖలైన కేసు అభియోగాలు. 20 ఏళ్లలో 200 కోట్ల డాలర్ల లాభాలు గడించాలని అదానీ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకున్నదని అభియోగాల సారాంశం. సోలార్ సెల్ అండ్ మాడ్యులర్ ప్లాంట్ల నుంచి స్థానికంగా తయారయ్యే 8,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలను అదానీ గ్రూప్ కోరింది. 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంటే, ఒడిశా 500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతోనూ 2021 జూన్ నుంచి 2021 డిసెంబర్ మధ్య సౌర విద్యుత్ కొనుగోళ్లకు ఒప్పందాలు కుదిరాయి. అలాగే దిల్లీ కేంద్రంగా పని చేస్తున్న అజూర్ పవర్ మీద అభియోగాలు నమోదయ్యాయి. అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ వేర్వేరుగా కేసులు నమోదు చేశాయి.

# అరెస్టు చేయాలి

**న్యూఢిల్లీ:** అధికారులకు మిలియన్ డాలర్ల కొద్దీ లంచం ఇవ్వడం, మోసానికి పాల్పడినట్లు అమెరికాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అంతేకాకుండా సెబీ అధినేతపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి రాహుల్ గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అమెరికా, భారత చట్టాలను అదానీ ఉల్లంఘించారనే విషయంపై ఇప్పుడు స్పష్టత వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. 'శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతాం. ప్రధాని మోదీ వందశాతం అదానీని రక్షిస్తున్నారు. అదానీ అవినీతితో దేశ ఆస్తులు సొంతం చేసుకున్నారు. అదానీ బీజేపీకి పూర్తిగా మద్దతు ఇస్తారనే విషయం నిరూపితమైన అంశం. గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని మేము కోరుతున్నాం. కానీ అదానీ అరెస్టు అవ్వరు. ఎందుకంటే భారత దేశ ప్రధాని మోదీ అదానీ వెనుక ఉన్నారు. ఆయన్ని రక్షిస్తున్నారు. ఎవరు నేరం చేసినా వారిని జైలులో పెడతానని నరేంద్ర మోదీ అంటారు. అదానీ నేరం చేశారని అమెరికా ఏజెన్సీ చెబుతోంది. భారత్‌లో అదానీ నేరం చేసినట్లు అమెరికా చెబుతోంది. లంచాలు ఇచ్చినట్లు, విద్యుత్‌ను ఎక్కువ ధరకు అమ్మినట్లు చెబుతోంది. కానీ ఇక్కడ ప్రధాన మంత్రి ఏమీ చేయడం లేదు. ఏమీ చేయలేరు కూడా. ఎందుకంటే ప్రధాని మోదీ గౌతమ్ అదానీ నియంత్రణలో ఉన్నారు' అని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

# గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లపై పీడీ యాక్ట్

## 'రుణ' యాప్ బాధితుల్లో విద్యావంతులే అధికం

### శాసనసభలో మంత్రి అనిత

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపుతూ పీడీయాక్ట్ కేసుల నమోదుతో పాటు, ఆస్తుల జప్తుకూ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టే అంశంపై శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ (రాజమండ్రి), రెడ్డప్పగారి మాధవిరెడ్డి(కడప), సుందరపు విజయ్ కుమార్ (యలమంచిలి) అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. వైసీపీ గత ప్రభుత్వం గంజాయిని పెంచి పోషించిందని ఆరోపించారు. ఐదేళ్లలో గంజాయిపై ఒక్క సమీక్ష కూడా జరగలేదన్నారు. అందుకే ఏజెన్సీ ప్రాంతాల నుంచి చిన్న పిల్లల స్కూల్ బ్యాగుల్లోకి గంజాయి వచ్చి చేరిందని అన్నారు. గంజాయి కట్టడిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. ఐదు నెలలలో 25 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగలిగామన్నారు. 916 మందిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. తాజాగా రాజమండ్రిలో ఒక ఫార్మాసిస్టు... జైల్లో ఉన్న నిందితుడికి గంజాయి అందించిన ఘటనలో నిఘా అధికారులు అతన్ని గుర్తించి అరెస్టు చేసి జైలుకు పంపించడమే ప్రభుత్వ అప్రమత్తతకు ఒక ఉదాహరణ అని అన్నారు. గంజాయి నిర్మూలన కోసం 469 మందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించామన్నారు. మిగిలిన శాఖలతో సంబంధం లేకుండా గంజాయి నిర్మూలన దృష్ట్యా ఈ విభాగానికి సర్వాధికారాలు కల్పించామని మంత్రి చెప్పారు. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల్లో బ్లేడ్ బ్యాచ్‌లు పెరిగిన దృష్ట్యా పటిష్ఠ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. లోన్ యాప్‌ల వల్ల రాష్ట్రంలో 212 మంది ఇబ్బంది పడినట్లు గుర్తించామని చెప్పారు. గూగుల్ ప్లేస్టోర్‌లో 456 నకిలీ రుణ యాప్‌లను గుర్తించి... కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గో క్యాష్, లోన్ బారో, క్యాష్ బనానా, లింక్ లోన్ వంటి యాప్‌లను వంటివి ఉన్నట్లు చెప్పారు. 229 యాప్‌లను ప్లే స్టోర్‌లో బ్లాక్ చేయించినట్లు తెలిపారు. రుణ యాప్‌ల ఉచ్చులో పడి నష్టపోతున్న వారిలో నిరక్షరాస్యులే కాదు అక్షరాస్యులు కూడా ఉండటంతో దీనిపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత అన్నారు.

# విశాఖ ఉక్కుపై దద్దరిల్లిన మండలి

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్ రాష్ట్రానికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని, దీనికోసం 32 మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఇప్పటికే 4,500 మంది కార్మికులను తొలగించారని, రెగ్యులర్ ఉద్యోగులకు 50శాతం విధించారని, అలవెన్స్‌లో కోత విధిస్తున్నారని, డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారని వివరించారు. 2,500 మంది శాశ్వత ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చేస్తున్నారన్నారు. కర్నాటక, చత్తీస్‌గఢ్‌లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశారని వివరించారు. కూటమి ప్రభుత్వంగానీ, డిప్యూటీ సీఎం గానీ... ప్రైవేటీకరణ ఆపాలని ప్రధాని మోదీతో ఏమైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ బదులిస్తూ... విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోనీయమని స్పష్టంచేశారు. ప్రైవేటీకరణ ఆలోచనే లేనప్పుడు... ప్రైవేటీకరణ వైపునకు అడుగులు పడుతోందని చెప్పడంలో అర్థం లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూడటమే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. స్టీల్ ప్లాంట్ ఏ ఒక్కరిదో, ప్రాంతానిదో కాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. గతంలో భూములు అమ్మాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే కార్మికులు మమ్మల్ని సంప్రదించారని పవన్ గుర్తుచేశారు.

పీడీఎఫ్ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, పాలకపక్షం, ప్రతిపక్షం కలిసి ఉన్నదాన్ని అమ్మేస్తారా అని నిలదీశారు. విశాఖ ఉక్కుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ఏమిటనేదీ స్పష్టం చేయాల్సి ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ ఉక్కు అన్ని ప్రాంతాలకు ఆదర్శనీయమని, నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో దిల్లీకి అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లాలని మేం చెప్పినా ఎవరూ స్పందించలేదన్నారు. కూటమి ఎన్నికల హామీ మేరకు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వబోమని, ఆపుతామని హామీ ఇచ్చారన్నారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి కుమారస్వామి రాష్ట్రంలో పర్యటించి ప్రైవేటీకరణ చేయబోమని వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ఇది భావోద్వేగంతో కూడిన అంశమని, గత ప్రభుత్వ హయాంలో భూములు విక్రయిస్తారన్న అంశంపై అధికార సభ్యులు చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. విశాఖలో ప్రధాని మోదీ అధ్వర్యంలో జరిగిన సభలోనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని అప్పటి సీఎం జగన్ చెప్పారని గుర్తుచేశారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా ఉక్కు ప్రైవేటీకరణ కొనసాగితే, దానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. స్పందించిన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఆరోజు త్రికరణశుద్ధిగా మాట్లాడితే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదని వ్యాఖ్యానించగా... దీనిపై వైసీపీ సభ్యులు సమాధానం ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలంటూ నిరసనకు దిగారు. చైర్మన్ వారిని పదేపదే ఆపేందుకు ప్రయత్నించినా వెనక్కి తగ్గలేదు. ఇలాంటి ఆలోచనతో వస్తే మైక్ ఇవ్వబోనని నిరాకరించారు. వైసీపీ సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో మండలిని ఐదు నిముషాలపాటు వాయిదా వేశారు.

# ఎన్టీపీసీ భారీ పెట్టుబడులు

## రూ.1,87,000 కోట్లకు ఒప్పందం

### సీఎం చంద్రబాబు సమక్షంలో సంతకాలు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఏపీలో ఎన్టీపీసీ భారీ పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పునరుత్పాదక రంగంలో ప్రాజెక్టులు పెట్టేందుకు సిద్ధమైంది. దాదాపు రూ.1,87,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో గురువారం సాయంత్రం ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రానికి రూ.20,620 కోట్ల ఆదాయం రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే 1.06 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు ఎన్‌జీఈఎల్, ఎన్ఆర్ఈడీసీఏపీ అధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవి సమక్షంలో ఎంవోయూ చేసుకున్నారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో సత్ఫలితాలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. 'లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కార్యాలయాల తరలింపు కూడా ఉండదు, అవి కర్నూలులోనే ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉత్తరాంధ్రలో విశాఖ, సీమలో కర్నూలు, తిరుపతి పట్టణాలను మరింత అభివృద్ధి చేస్తాం. మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం మూడు ముక్కలాటలాడి ఏ ప్రాంతం అభివృద్ధి కాకుండా చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మేము విశాఖ, కర్నూలులో కూడా అమరావతే రాజధాని అని ఆ ప్రాంత ప్రజలను ఒప్పించాం. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం. గతంలో చేశాం, మళ్లీ చేసి చూపిస్తాం. రాయలసీమగా ఎడారిగా మారుతుందని ఆలోచించి కృష్ణా జలాలను సీమకు తరలించాలని ఆలోచించింది ఎన్టీఆర్. ఇందులో భాగంగానే తెలుగుగంగ, హంద్రీనీవా, నగరి గాలేరు ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారు. వాటిని పూర్తి చేసేది కూడా ఎన్డీయేనే. నదుల అనుసంధానం చేసి, పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్తే గేమ్ ఛేంజర్ అవుతుంది. కియా పరిశ్రమను తీసుకొచ్చేందుకు యేడాదిలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేశాం. కియా రాకతో అనంత జిల్లా ముఖచిత్రం మారిపోయింది. హార్టికల్చర్ అభివృద్ధి చేస్తే మహర్దశ వస్తుంది. అనంతపురానికి బెంగళూరు ఎయిర్ పోర్టు, కర్నూలుకు హైదరాబాద్ ఎయిర్ పోర్టు, చిత్తూరుకు చెన్నై ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉన్నాయి. ఈ మూడు అవకాశాలను అభివృద్ధికి ఉపయోగించు కోవచ్చు. అలాగే ఓర్వకల్లులో ఎయిర్ పోర్టు పెట్టాం. తిరుపతి ఎయిరో పోర్టును విస్తరించి సర్వీసులు పెంచేలా చేశాం. కడప ఎయిర్ పోర్టులో రాత్రి సమయం లోనూ విమానాలు దిగే అవకాశం కల్పించాం. ప్రస్తుతం నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయి. అలాగే రాయలసీమలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చుతున్నాం. తిరుపతి ఐఐటీ, ఐజర్, కర్నూలులో ట్రిపుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. యువగళంలో ప్రకటించిన విధంగా మిషన్ రాయలసీమ హామీలను నెరవేర్చుతాం. హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు 90 శాతం రాయితీతో డ్రిప్ సబ్సిడీ ఇచ్చాం..కానీ గత ప్రభుత్వం దాన్ని కూడా రద్దు చేసింది. మళ్లీ రాయితీతో డ్రిప్ ను రైతులకు అందిస్తాం. వైసీపీ ప్రభుత్వం రాయలసీమకు చీమంత కూడా మేలు చేయలేదు. టీడీపీ హయాం లోనే తిరుపతి హార్డ్ వేర్ హబ్‌గా మారింది. కేంద్రం రెండు ఇండస్ట్రియల్ పార్కులు ఇస్తే వాటిని కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేశాం. వీటి అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూర య్యాయి. ఓర్వకల్లును డ్రోన్ హబ్ గా మార్చేందుకు 300 ఎకరాలు కేటాయిం చామని ముఖ్యమంత్రి వివరించారు.

# ఉక్రెయిన్‌పై రష్యా ఖండాంతర క్షిపణి దాడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఇది తమ సైనికులను అడిగాల్సిన ప్రశ్న అని ఆయన తెలిపారు. వాస్తవానికి ఖండాంతర క్షిపణి(ఐసీబీఎం)ని దీర్ఘశ్రేణి ఆయుధంగా పరిగణిస్తారు. కనీసం 5,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటేనే దీనిని ప్రయోగిస్తారు. భూగర్భంలో ఏర్పాటు చేసిన సిలోస్ నుంచి లేదా మొబైల్ వాహనాల పైనుంచి ప్రయోగించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఘన ఇంధన ఐసీబీఎంను అత్యంత ప్రమాదకారిగా పేర్కొంటారు. 1957లో తొలిసారిగా సోవియట్ యూనియన్ దీనిని ప్రయోగించింది. ఆ తర్వాత అమెరికా 1959లో వీటిని విజయవంతంగా పరీక్షించింది. 3,000 కిలోమీటర్ల నుంచి 5,000 కి.మీ. లక్ష్యాలను ఛేదించే వాటిని మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులుగా పరిగణి స్తారు. ఉక్రెయిన్‌కు తాము అందిస్తున్న దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపై దాడికి వినియోగించుకునేందుకు ఆ దేశానికి అనుమతిస్తున్నట్లు బైడెన్ సర్కారు ప్రకటించింది. ఈ నిర్ణయంపై రష్యా తీవ్రంగా స్పందించింది. అధ్యక్షుడు పుతిన్ అణ్వస్త్ర ప్రయోగానికి మార్గం సుగమం చేసేలా ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో పాటు ఉక్రెయిన్‌కు సహకరించే దేశాలను యుద్ధంలో ప్రత్యర్థులుగానే భావిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రష్యా భారీగా దాడి చేయవచ్చన్న నిఘావర్గాల సమాచారంతో నిన్ననే కీవ్‌లో అమెరికా సహా కొన్ని దౌత్యకార్యాలయాను మూసివేశారు.

**సైలెంట్‌గా ఉండు..**

రష్యా తొలిసారి ఉక్రెయిన్‌పై ఖండాంతర క్షిపణితో దాడి చేసింది. ఈ దాడి తర్వాత ఒక ఆసక్తికర వీడియో వెలుగులోకి వచ్చింది. ఈ అంశంపై మౌనంగా ఉండాలని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధికి రష్యా ఉన్నతస్థాయి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చినట్లు తెలుస్తోంది. రష్యా విదేశాంగ ప్రతినిధి మరియా జఖరోవా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అప్పటికే ఉక్రెయిన్‌పై రష్యా నుంచి ఖండాంతర క్షిపణి లాంచ్ అయింది. అప్పుడే ప్రెస్‌మీట్‌లో ఉన్న ఆమెకు ఉన్నతస్థాయి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఘటన గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, మౌనంగా ఉండాలని ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఆ వీడియో వైరల్ అవుతోంది.

# సమస్యల పరిష్కారానికే ముఖాముఖి

(మొదటిపేజీ తరువాయి)

అంశాలను పక్కన పడేశారన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం... ఇవన్నీ ప్రజా ప్రభుత్వం విజయాలన్నారు. అధికారంలోకి రాగానే ఏడాదిలోపే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. గత పాలకులు పదేళ్ల పాటు గ్రూప్ -1 నిర్వహించలేకపోయారన్నారు. తాము ఎలాంటి అడ్డంకులు లేకుండా విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. మహిళలకు ఏడాదికి రూ.25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, ఐదేళ్ల కాలంలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులతో 10 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని వివరించారు. బస్సులు కొనుగోలు చేసి వాటిని మహిళా సంఘాలకు అప్పగించి... వారు ఆర్టీసీకి బస్సులు లీజుకు ఇచ్చి ఆదాయం పొందేలా చూస్తామని చెప్పారు. ప్రపంచస్థాయి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, మూలనపడ్డ 65 ఐటీఐలను అడ్వాన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కులగణన చారిత్రాత్మక నిర్ణయమని, దీనిని అడ్డుకోవాలని దోపిడీదారులు సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి : రామ్‌గోపాల్

**విశాలాంధ్ర -బ్యూరో నిర్మల్ జిల్లా :** గురువారం పెంబి మండల కేంద్రంలోని మ్యాక్స్‌లో ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు అనేక రకాల రుణ, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు అన్ని రకాల పథకాలు రుణాలు, బీమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జన సురక్ష, పీఎం విశ్వకర్మ, ముద్ర, పీఎంఈజీపి, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పిఎం ఎఫ్ఎంఈ, ఇతర వ్యవసాయ రుణాలపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారు రుణాలు పొంది వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలైన డెయిరీ, కోళ్లు, చేపలు, తేనె టీగలు పెంపకం వంటి రంగాలలో, కుటీర పరిశ్రమ, వ్యాపార, కుల వృత్తులలో అభివృద్ధిని సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, తహసిల్దార్ లక్ష్మణ్ ఎంపీడీవో రమాకాంత్, ఏడిసిసి బ్యాంకు ఖానాపూర్ శాఖ మేనేజర్ కల్పన, ఎఫ్ఎల్ సి మచిందర్ రెడ్డి, సిఎఫ్ఎల్ జాదవ్, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూమిని లాక్కొని నీతులు పలకడం సిగ్గుచేటు : సీపీఐ

**విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి పేరిట వందలాది ఎకరాల దళిత గిరిజన భూములు లాక్కొని ఈరోజు నీతులు పలుకుతూ పోరాటాల పేరుతో హడావుడి చేయటం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి అన్నారు. గురువారం జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలోని కొరివి మండల కేంద్రంలో తురక రమేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా విజయ సారధి పాల్గొని మాట్లాడుతూ నూతన కలెక్టరేట్లు, మెడికల్ కాలేజీలు ,స్మశాన వాటికలు ,పల్లె ప్రకృతి వనాల పేరుతో కేవలం దళిత, గిరిజన భూముల బలవంతంగా లాక్కొని వారిని బజారున పడవేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని, తమ అవినీతి విధ్వంస పాలన కప్పిపుచ్చుకోవడడానికి నేడు తగుదునమ్మా అని వల్లమాలిన ప్రేమ వలకబోస్తూ ఆర్భాటాలు చేయడం ద్వంద నీతికి నిదర్శనమని పేర్కొన్నారు. 100 సంవత్సరాల నిండబోతున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అని,పార్టీ శత జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, పార్టీ సభ్యత్వాన్ని గ్రామ గ్రామాన పూర్తిచేసి, స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2025 సభ్యత్వాన్ని పార్టీ శ్రేణులకు అందించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరావు,సిపిఐ కొరవి, మరిపెడ, దంతాపల్లి, డోర్నకల్ మండల కార్యదర్శులు కరణం రాజన్న, మారగని బాలకృష్ణ, పోలేపాక వెంకన్న, తురక రమేష్, నాయకులు దొంతు రామూర్తి, ఆర్ రవి, నిలుగొండ నాగేశ్వర్ రావు, రేపాకుల పాపయ్య బొల్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు మంచి రోజులు : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-వనపర్తి :** ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా మత్స్యకార సోదరులందరికీ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మత్స్యకారులందరికీ మంచి రోజులు వచ్చాయని, మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మత్స్యకార కుటుంబాలను బీసీడీ గ్రూప్ నుంచి 'ఏ' గ్రూప్‌లోనికి మార్చడం చేపల వేట చేసుకునే మత్స్యకారులందరికీ చెరువులపై పూర్తి హక్కులు కల్పించడం, ఉచిత చేపపిల్లలను పంపిణీ చేయడం లాంటి అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని మత్స్యకారులు అందరికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంచి రోజులు రానున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## మతోన్మాద శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాలి

**విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి:** మతోన్మాద విద్వేష శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వామపక్ష పార్టీల నేతలు అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మతోన్మాద వ్యతిరేక సదస్సులో సీపీఐ, సీపీఎంల జిల్లా కార్యదర్శులు తాండ్ర సదానందం, వై.యాకయ్య, సీపీఐ(ఎంఎల్) పార్టీల నాయకులు జూపాక శ్రీనివాస్,కె.రాజన్న, ఇ.రామక్రిష్ణలు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల మధ్య మతవిద్వేషాలు పెంచేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపిలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. నేరస్తులు మైనారిటీ మతాలకు చెందిన వారైతే మతంరంగు పులిమి ఘర్షణలను రెచ్చగొడుతున్నారన్నారు. మహిళలు, దళితులు, ఆదివాసీలమీద జరుగుతున్న దాడులు, అత్యాచారాల పట్ల వీరికి పట్టిలేదన్నారు. రాష్ట్రంలో 120 మంది దళితులపై కులఆహంకార హత్యలు జరిగాయని, వీటిపై ఎలాంటి స్పందన లేదని వారిపై ఒక్కడి మీద జరిగిన మత ఘర్షణ సృష్టించేందుకు ప్రజలను సంఘ్ పరివార్ రెచ్చగొడుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌తో పాటు బీజేపి పాలిత రాష్ట్రాల్లో దళితులు,గిరిజనులు,ఇతర పేదవర్గా లపై దాడులు జరుగుతున్నా వారు పట్టించుకోవడంలేదన్నారు. మహత్తర తెలంగాణ సాయుధపోరాటానికి మతం రంగు పులుముతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు,రాష్ట్ర నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్ ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయమంత్రి రామప్ప దేవాలయం సందర్శన

**విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో :** వెంకటపూర్ మండలం పాలంపేట గ్రామం లోని రామప్ప దేవాలయం సందర్శనకు గురువారం విచ్చేసిన కేంద్రవినియోగదా రుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతిబాయ్ బంబానియాకు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. రామప్ప ఆలయ ప్రాంగణం లో పోలీస్‌ల గౌరవ వందనం కేంద్ర మంత్రి స్వీకరించారు. కేంద్ర మంత్రికి దేవాలయ వేద పండితులు సంప్రదాయ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి రుద్రేశ్వరుడినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు కేంద్ర మంత్రి కి పట్టు వస్త్రాల తో సత్కరించి , ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. రామప్ప దేవాలయ ప్రత్యేకత అయినటువంటి నీటిపై తేలియాడే ఇటుక గూర్చి, ఆలయ చరిత్ర , శిల్ప సంపద విశిష్టత గూర్చి ఆలయ గైడ్ కూలంకషంగా కేంద్ర మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డిఎస్ పి రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నియంతృత్వ ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వం : హరినాయక్

**విశాలాంధ్ర-గార్ల :** లగచర్ల రైతులు తమ అస్తిత్వం ఉనికి కోసం తిరుగబడ్డారని ఈ సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుండా నియంతృత ధోరణులు ఆలంభిస్తుందని తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్ విమర్శించారు. బుధవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ లగచర్లలో రైతులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని చెప్పారు. వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు ఎలా పంపిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులపై చేస్తున్న దాష్టికాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ బాధితులను కలవడానికి తమ సంఘం నాయకులు ధర్మానాయక్, శ్రీరాం నాయక్, కార్మిక, రైతు సంఘాల నేతలు వెంకట్ రాములు, శోభన్ లు వెళ్లగా వీరిని పోలీసులు అరెస్టు చేసి బొమ్మరాస్ పేట పోలీస్ స్టేషన్ కు లించారాని విమర్శించారు. జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి జరిగిందనే వంకతో చుట్టుపక్కల ఉన్న గిరిజన తండాలు గ్రామాలపై పోలీసులు ముళ్ళకంచెలను వేసి బయట రాకుండా అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి : కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం :** జిల్లాలో నిర్వహించిన సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్లైన్ చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులు సిబ్బందిని కోరారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమంలొ పాల్గొని కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో సర్వే విజయవంతంగా జరుగుతుందన్నారు. అదే తరహాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఆన్లైన్ లో ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేసేందుకు చర్యలు చేపట్టబోతున్నామన్నారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఒక్కొక్క ఆపరేటర్‌కు నిర్దేశించిన కుటుంబాల సంఖ్య ఆధారంగా ఆన్లైన్‌లో వారి వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. వివరాలను ఆన్లైన్ నమోదు ప్రక్రియను సూపర్వైజర్లు, ప్రత్యేక అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆన్లైన్ నమోదు ప్రక్రియ విషయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

## 26న కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

**విశాలాంధ్ర -ఖమ్మం :** కేంద్రంలో నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముఖ్యంగా రైతుకు మద్దతు ధర, మూడు నల్ల చట్టాలు, లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 26న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. గురువారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం జరిగింది. దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో మహత్తర రైతాంగ పోరాటం సందర్భంగా రైతులకు కనీస మద్దతు ధర ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మరిచిపోయినట్లు వ్యవహరిస్తుందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చారని -వాటిని రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏ మంత్రి వర్గ సమావేశంలోనూ వ్యవసాయ కార్మికుల గురించి ప్రభుత్వం ఆలోచన చేసినది లేదన్నారు. ముఖ్యంగా రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి జరుగుతుందని ఈ ముట్టడిలో పెద్ద ఎత్తున వివిధ సంఘాల నేతలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు బొంతు రాంబాబు, బందెల వెంకయ్య, కార్మిక సంఘాల నాయకులు తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, రావి శివరామకృష్ణ, ఎండివై పాషా, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, తిమ్మిడి హన్మంతరావు, లక్ష్మి నారాయణ, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : కిసాన్ మోర్చా

**విశాలాంధ్ర - కొత్తగూడెం :** కేంద్ర ప్రభుత్వం కుట్రపురితంగా ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కొడ్లను రద్దు చెయ్యాలని కిసాన్ మోర్చా నేతలు డిమాండ్ చేసారు. కిసాన్ మోర్చా రైతులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో గురువారం సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల జాయింట్ ప్లాట్ ఫామ్‌గా ఏర్పడి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల రైతు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం హక్కులు వంటి హామీలను రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నాయని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఏడాది నుండి పలు రైతు సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ పలు మల్టీ నేషనల్ కార్పొరేట్లతో వ్యవసాయ పరిశోధనల కోసం అనేక ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వ రంగంలో ఎఫ్సీఐ, సెంట్రల్ వేర్ హౌస్ కార్పొరేషన్, మార్కెట్ యార్డులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అద్దెకివ్వడం సరికాదన్నారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాలలో మరింత పెంచి దోపిడీకి హద్దు పద్దు లేకుండా బిజెపి ప్రభుత్వం చేసిందన్నారు. సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్ లతో బానిసత్వంలోకి నెట్టబడ్డారని చెప్పారు. ఈనెల 23న కొత్తగూడెం పట్టణంలో బైకు ర్యాలీ, 26న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య రైతు సంఘాల నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ, బి ప్రసాద్ యాకూబ్ షా వలి సారంగపాణి రామ్ సింగ్ వీరన్న మల్లికార్జున్, ఊక్లా, రామ్మూర్తి నాయుని రాజు కల్లూరి కిషోర్ దుబ్బాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**విశాలాంధ్ర- నల్లగొండ బ్యూరో :** మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రీడా పోటీలను నల్లగొండ జిల్లా కేంద్రంలో మేకల అభినవ స్టేడియంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సువాస్ సెల్వాయి జీవితం వికలాంగులకు ఆదర్శమని అతడు టోక్యోలో జరిగిన పారా ఒలంపిక్స్‌లో రెండుసార్లు మెడల్ సాధించి దేశానికి వన్నె తెచ్చారని అన్నారు. అంగవైకల్యం అనేది ఎవరికి అడ్డు కాదని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యం అడ్డు రాదని ఆమె అన్నారు. ఈ రోజు రేపు జూనియర్ మరియు సీనియర్ దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహిస్తూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 25 నవంబర్ నుండి జరిగే రాష్ట్రస్థాయిలో దివ్యాంగుల ఆటల పోటీలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో జూనియర్ మరియు సీనియర్ దివ్యాంగులకు క్యారం చెస్ షాట్ పుట్ వీల్ చైర్ పరుగు పందెం పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని కె.వి.కృష్ణవేణి జిల్లా యువజన క్రీడ అధికారి విష్ణుమూర్తి స్కూల్ గేమ్ ఫెడరేషన్ విమల సిడిపిఓలు నిర్మల, లావణ్య కుమారి,హరిత ఫిజికల్ డైరెక్టర్స్ సఖీ స్టాఫ్ సునీత, నాగమణి, ఐ సి పి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్య కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం : రఘు

**విశాలాంధ్ర-ములుగు జిల్లా ప్రతినిధి :** ఏజెన్సీ ప్రాంతం మత్స్య కారుల హక్కులకై పోరాటం చేయవల్సిన సమయం అసహనం అయిందని, ముదిరాజ్ కులస్తులను బీసీ డి నుంచి ఏ లోకి చేర్చాలని, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ములుగు నియోజకవర్గం ఇంచార్జి, ఏటూరునాగారం సంఘం అధ్యక్షులు సి హెచ్ రఘు అన్నారు.ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం ఏటూరునాగారం మత్స్య కార్మికుల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహాసభ మత్స్య కార్మికుల జెంగాను, రఘు ఎగురవేశారు. ఈసందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ ఏజెన్సీ మత్స్య కారుల హక్కులకై పోరాడాలని గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నా నీటి పై, చెరువుల పై హక్కు కల్పించాలని అన్నారు ఇప్పటి ప్రభుత్వాలు మత్స్యకారుల జీవన విధానం పై దెబ్బ కొట్టుతున్నాయఅని చెరువులలో, గోదావరి లో చేపలు పట్టి రోడ్లపై చేపలు, పండ్లు, గడ్డలు అమ్ముకొని బ్రతుకుతున్నామని అన్నారు. ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు భాస పుల్లయ్య ముదిరాజ్, ముదిరాజ్ కులాపెద్దలు నకిరబోయిన రమేష్ ముదిరాజ్ , రాష్ట్ర మత్స్య శాఖ కార్యదర్శి చింతకింది రాజుముదిరాజ్ , గీకురు లింగయ్య, ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ సభ్యత్వ నమోదు

**విశాలాంధ్ర - చర్ల :** మండలంలో సీపీఐ సభ్యత నమోదు కార్యక్రమం వేగవంతంగా సాగుతున్నట్లు ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కర్లూరి వెంకటేశ్వరరావు వెల్లడించారు. గురువారం నాయకుల కాలనీ గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో ఆయన సీపీఐ పార్టీ నూతన సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక వర్గాల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమే అన్నారు. దోపిడీ లేనిరాజ్యం కోసం కులరహిత సమాజం తోపాటు సమ సమాజ స్థాపన కోసం నిరంతరం ప్రజల తరపున పోరాడిది ఎర్రజెండా మాత్రమే అన్నారు. అందుకే ప్రజలు కూడా ఆలోచించి సిపిఐ పార్టీకి అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు ఆళ్లగడ్డ తాతాజీ, కాకర్ల అనసూర్య, గాయం సీతారావమ్మ, యాదవుల సీతమ్మ, పయ్యావుల జయమ్మ, రెడ్డి ప్రసాద్, రేసు సీతారాములు, ఆదిలక్ష్మి, కాకర్ల సాయి కిరణ్, రాంబాబు, హేమల గంగారాజు, మాల్యాద్రి, సాంబశివరావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీపై శిక్షణ

**విశాలాంధ్ర బ్యూరో - మెదక్:** సమగ్ర కుటుంబ సర్వే క్వాలిటీ డేటా ఎంట్రీ ప్రధాన లక్ష్యంగా 516 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సామాజిక ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే డేటా ఎంట్రీపై సంబంధిత మండల అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.సామాజిక ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే కంప్యూటర్ ఆపరేటర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. జిల్లాలో సమగ్ర సర్వే నిన్నటి వరకు 86 శాతం పూర్తయిందని తెలిపారు. 516 డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇందుకోసం నియమించినట్లు తెలిపారు. 20 మంది ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు 4, ఎంపీఎస్వోలు19 ఈ డేటా ఎంట్రీలో పాల్గొంటారని తెలిపారు. జడ్పీ సీఈఓ ఎల్లయ్య, బద్రీనాథ్ పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ తప్పులు లేకుండ చూడండి: జేసీ

**విశాలాంధ్ర-నేరేడుచర్ల :** సమగ్ర కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం ఆయన నేరేడుచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ధ్రువ పత్రాలను పరిశీలించారు. సమగ్ర కుటుంబ సర్వే మండలంలోని ఎంత శాతం అయ్యిందనే వివరాలను తహసీల్దార్, ఎంపీడీవోలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సర్వే పూర్తయిన వారి వివరాలను ఆన్లైన్ చేయుటకు ఉపయోగించే కంప్యూటర్స్ మరియు అరేంజ్మెంట్స్ వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరగబోయే డాటా ఎంట్రీ పరిశీలించారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆయన వెంట స్థానిక తాశీల్దార్ సురగి సైదులు, ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏ అశోక్ రెడ్డి ,ఎం.పీ. ఓ. హరి సింగ్ మరియు కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజాసేవకు అంకితం కావాలి : చంద్రశేఖర్‌రెడ్డి

**విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం :** ప్రజాసేవకు పోలీస్ అంకితం కావాలని, ప్రజల్లో విశ్వసనీయత కల్పించాలని మల్టీ జోన్ -1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. తొమ్మిది నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణను పూర్తి చేసుకున్న 263 ఏఆర్, సివిల్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) గురువారం సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్టీ జోన్ -1 ఐజీపీ ముందుగా ట్రైనీ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధి నిర్వహణలో వివక్ష చూపమని, తమ సేవలతో దేశ ప్రతిష్ట పెంచుతామని శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ప్రతిజ్ఞ చేశారు. తొమ్మిది నెలల శిక్షణలో పోలీసు పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, క్రిమినల్ చట్టం తదితర శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఏఆర్ అడిషనల్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రఘు, రహెమాన్, రవి, శ్రీనివాసులు, సాంబరాజు పాల్గొన్నారు.

## ఇండియా హెల్త్‌కేర్ ఫండ్ ప్రారంభం

**విశాలాంధ్ర-ముంబయి:** ఇండియా మ్యూచువల్ ఫండ్ గురువారం పీజీఐయం ఇండియా హెల్త్‌కేర్ ఫండ్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ కంపెనీల ఈక్విటీ మరియు ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ఫండ్ బీఎస్ఈ హెల్త్‌కేర్ టీఆర్ఐ దాని బెంచ్‌మార్క్‌గా ఉపయోగిస్తుంది. కొత్త ఫండ్ ఆఫర్ నవంబర్ 19, 2024న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుంది మరియు డిసెంబర్ 03, 2024న ముగుస్తుంది. ఈ స్కీమ్ నిరంతర విక్రయం మరియు తిరిగి కొనుగోలు కోసం డిసెంబర్ 11, 2024న తిరిగి తెరవబడుతుంది.

## ఎక్స్ఏటీ 2025 పరీక్ష రిజిస్ట్రేషన్‌కు డెడ్ లైన్ ప్రకటన

**విశాలాంధ్ర-ముంబయి:** ఎంబీఏ ఎంట్రన్స్ కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రీమియర్ పరీక్షే ద జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎక్స్ఏటీ ). ఇప్పుడు ఈ ఎక్స్ఏటీ 2025 పరీక్షకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డెడ్ లైన్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షకు హాజరు కావాలనుకున్న అభ్యర్థులు నవంబరు 20, 2024 లోపు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. తద్వారా బిజినెస్ మేనేజ్ మెంట్ తమ కెరీర్ గా మార్చుకునేందుకు అభ్యర్థులకు వీలు కలుగుతుంది. 2025 పరీక్ష వచ్చే ఏడాది అంటే 2025 జనవరి 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 వరకు జరుగుతుంది.

## ఐక్యూ ఫ్లాగ్ షిప్ డిసెంబర్ 3న లాంచ్

**విశాలాంధ్ర-హైదరాబాద్:** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ డిసెంబర్ 3న ఐక్యూ 13ను లాంచ్ చేయనుంది. స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన ఐక్యూ 13 అధునాతన కెమెరా సామర్థ్యాలు, అద్భుతమైన డిజైన్ పొడిగించిన బ్యాటరీ లైఫ్ మరియు ఇమ్మర్సివ్ డిస్ప్లే టెక్నాలజీలతో మెరుపు-వేగవంతమైన పనితీరును మిళితం చేస్తుంది. ఇది వారి స్మార్ట్‌ఫోన్ల నుండి ఉత్తమ పనితీరు, డిజైన్ మరియు కార్యాచరణను ఆశించే వినియోగదారులకు సాటిలేని అనుభవాన్ని అందిస్తుంది.

## భారతదేశంలో ఆపో ఫైన్డ్ ఎక్స్8 సిరీస్ విడుదల

**విశాలాంధ్ర-ముంబయి:** భారతదేశంలో ఆపో ఫైన్డ్ ఎక్స్8 సిరీస్‌ను విడుదల చేశామని OPPO ఆపో ఇండియా నేడు ప్రకటించింది. ఆవిష్కరణ వారసత్వానికి నిదర్శనంగా ఆపో తన ఫైన్డ్ ఎక్స్8 సిరీస్ ఫ్లాగ్‌షిప్ మీడియాటెక్ డైమెన్సిటీ 9400 ఎస్ఓసీ, రెండు టెలిఫోటో స్నాపర్‌లతో కూడిన పాత్-బ్రేకింగ్ క్వాడ్-కెమెరా సిస్టమ్, అధిక సాంద్రత కలిగిన వేగవంతమైన-చార్జింగ్ సిలికాన్ కార్బైడ్ బ్యాటరీ మరియు కలర్ ఓఎస్ 15 (ఆండ్రాయిడ్ 15 ఆధారితం) ఫోటోగ్రఫీ మరియు ప్రొడక్టివిటీ కోసం ఏ1 ఫీచర్‌ల హోస్ట్ ఇవన్నీ ఒక ఐపీ 68 మరియు ఐపీ 69-రేటెడ్ మన్నికైన ఇంకా తేలికైన నిర్మాణంలో కలిగి వున్నాయి.

## 9వ అగర్బత్తి అండ్ పెర్ఫ్యూమ్ ఎక్స్‌పో

**విశాలాంధ్ర- హైదరాబాద్:** పూజశ్రీ అనేది సనాతన సమాజానికి పవిత్రమైన, స్వచ్ఛమైన పూజా సామగ్రిని గ్రంథాల మార్గ దర్శకాలకు అనుగుణంగా అందించడానికి రూపుదిద్దుకున్న సంస్థ. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నవంబరు 23 వరకు జరిగే 9వ అంతర్జాతీయ అగర్బత్తి అండ్ పెర్ఫ్యూమ్ ఎక్స్‌పోలో ఈ సంస్థ పాల్గొం టోంది. పూజశ్రీ స్టాల్ నెం. జే-3 హాల్ నంబర్ 2లో ఉంది. ఇక్కడ స్వచ్ఛమైన, వైదికులచే ధృవీకరించబడిన పూజ ఉత్పత్తుల పొందవచ్చు.

## సుహానా ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వివో వై300 లాంచ్

**విశాలాంధ్ర-న్యూఢిల్లీ:** వినూత్న గ్లోబల్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ వివో తన ప్రీమియం వై-సిరీస్ లైనప్ ను విస్తరించింది. కొత్తగా లాంచ్ చేసిన ఈ స్మార్ట్‌ఫోన్ స్టైలిష్ టైటానియం ప్రేరేపిత డిజైన్ను కలిగి ఉంది. వివో వై300 5జీతో సహా వై-సిరీస్ సుహానా ఖాన్ బ్రాండ్ అంబాసిడర్ గా ప్రకటించింది. ఇది బ్రాండ్ యువ శక్తిని, ఆకర్షణను తీసుకువచ్చింది. ఈ స్మార్ట్‌ఫోన్ సమర్థవంతమైన సోనీ ఐఎంఎక్స్ 882 ప్రధాన కెమెరాతో శక్తివంతం చేయబడింది. ఇది ఏఐ ఆరా లైట్ మరియు 2ఎక్స్ పోర్ట్రెయిట్ ఫీచర్‌తో జత చేసినప్పుడు, పదునైన, సహజంగా కనిపించే పోర్ట్రెయిట్లను సంగ్రహించడానికి వినియోగదారులను అనుమతిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్లో ఏఐ ఎరేజ్, ఏఐ ఫోటో ఎన్హాన్స్ సహా అధునాతన ఏఐ కెమెరా ఫీచర్లు ఉన్నాయి, ఇది చిత్రాల స్పష్టతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వేగవంతమైన సమర్థవంతమైన ఛార్జింగ్ కోసం ఇది 80 వాట్ ఫ్లాష్ ఛార్జ్‌ను కలిగి ఉంది.

## బాదం పప్పు తోఉత్తమ ఫలితాలు

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** బాదంపప్పులను క్రమం తప్పకుండా తినడం వల్ల కండరాల పనితీరు మెరుగుపడటం, నొప్పి, కండరాల దెబ్బతినడం తగ్గి.. వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుందని ఒక కొత్త అధ్యయనం కనుగొంది. ఈ కొత్త అధ్యయనం, వ్యాయామం తర్వాత కోలుకోవటాన్ని బాదం ఎలా ప్రభావితం చేస్తుందో, అన్వేషించే శాస్త్రీయ ఆధారాలను పెంచుతుంది. మునుపటి అధ్యయనాలు అలసట, వ్యాయామ జీవక్రియ యొక్క భావాలపై బాదం యొక్క ప్రభావాన్ని పరిశోధించాయి. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా నిధులు సమకూర్చిన ఈ కొత్త అధ్యయనం, కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్‌లో ప్రచురించబడింది.

## భారతదేశంలో ఒప్పో ఫైండ్ ఎక్స్8 సిరీస్ విడుదల

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** భారతదేశంలో ఫైండ్ ఎక్స్8 సిరీస్‌ను విడుదల చేశామని ఒప్పో ఇండియా ప్రకటించింది. ఆవిష్కరణ వారసత్వానికి నిదర్శనంగా ఒప్పో తన ఫైండ్ ఎక్స్8 సిరీస్ ఫ్లాగ్‌షిప్ మీడియాటెక్ డైమెన్సిటీ 9400 ఎస్ఓసీ, రెండు టెలిఫోటో స్నాపర్‌లతో కూడిన పాత్ బ్రేకింగ్ క్వాడ్ కెమెరా సిస్టమ్, అధిక సాంద్రత కలిగిన వేగవంతమైన చార్జింగ్ సిలికాన్ కార్బైడ్ బ్యాటరీ, కలర్ ఓఎస్ 15 ఫోటోగ్రఫీ, ప్రొడక్టివిటీ కోసం ఏఐ ఫీచర్‌ల హోస్ట్.. ఇవన్నీ ఒక ఐపీ68, ఐపీ 69 రేటెడ్ మన్నికైన ఇంకా తేలికైన నిర్మాణంలో కలిగి ఉన్నాయి. ఫైండ్ ఎక్స్8 సిరీస్ డిసెంబర్ 3 నుంచి ఒప్పో ఈ-స్టోర్, ఫ్లిప్కార్ట్, మెయిన్ లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంటాయి.

## సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ చేపట్టాలి : కలెక్టర్

**విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో :** డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా నమోదును ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా పక్కగా చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల భవనంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ తీరును జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇవ్వడం జరిగినదని, డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 100 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమనేటర్లకు ప్రజలు సహకరించారని సర్వే వేగవంతంగా పూర్తి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎం.పి. ఓ. రహీం, ఈ డి ఎం దేవేందర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## లగచర్ల ఘటనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ ర్యాలీ

**విశాలాంధ్ర ఖమ్మం:** లగచర్లలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపిస్తూ బి ఆర్ ఎస్ జిల్లా కమిటీ నేతృత్వంలో బుధవారం భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ జిల్లా పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్రాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, వివిధ స్థాయిల్లో పని చేస్తున్న నాయకులు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ అక్కడి నుండి జడ్పీ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాజ్యసభ సభ్యులు ముద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ లగచర్ల సంఘటన ఢిల్లీ వరకు వెళ్ళింది అన్నారు. రైతుల పట్ల అమానుషంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిందని రైతులను తిరుగుబాటుదారులుగా చిత్రీకరించి బిఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులు చేసి నానా ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. అక్కడ ఫార్మా కంపెనీకి భూములను కేటాయించడంపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో రైతులు దాన్ని వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కొందరు ఆగ్రహంతో కలెక్టర్ తో సహా అధికారులపై తిరగబడిన సందర్భంగా అక్కడి బి.ఆర్.ఎస్ నాయకులను టార్గెట్ చేసి అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. కార్యక్రమం లో ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు ,మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ, పార్టీ నాయకులు దూకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

సంపాదకీయం

# వలంటీర్లపై కక్షసాధింపు తగదు

రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై పాలక కూటమి బుధవారం శాసనమండలిలో చేసిన ప్రకటన 2.66 లక్షల వలంటీర్లను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమను విధుల్లో కొనసాగించడంతోపాటు, వేతనం కూడా త్వరలోనే పెంచుతారని వేయికళ్లతో ఎదురుచూస్తున్న వలంటీర్లను ప్రభుత్వ తాజా ప్రకటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. 'రాష్ట్రంలో వలంటీర్లు లేరు. వలంటీర్ల వ్యవస్థ మనుగడలో లేదు' అని గ్రామ సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. తమ భవిష్యత్తుపై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అసలు ఆ వ్యవస్థే ఉనికిలో లేదని మంత్రి చేసిన ప్రకటన వలంటీర్ల ఊపిరి తీసింది. తమ భవిష్యత్తు అగమ్యగోచరమై దిక్కుతోచని స్థితిలో ఉన్న వలంటీర్లు అసలు ఈ వ్యవస్థే ఉనికిలో లేదన్న మంత్రి ప్రకటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వలంటీర్ వ్యవస్థ మొదలైంది. సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రారంభించినట్లు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. 50 నుంచి వంద కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున 2019 ఆగస్టులో వీరి నియామకం జరిగింది. అప్పటి నుంచి మేలో జరిగిన శాసనసభ ఎన్నికలలో వైసీపీ ఓటమి చెంది అధికారం కోల్పోయే వరకు వీరికి జీతాలు చెల్లించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షలమంది వలంటీర్లను వైసీపీ ప్రభుత్వం నియమించింది. వైసీపీ కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించుకున్నారనీ, వైసీపీ కార్యకర్తలకు ఉపాధి కేంద్రాలుగా వార్డు, గ్రామ సచివాలయాలు నిలిచాయని ఈ వ్యవస్థ ప్రారంభంలో విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం వలంటీర్ల ద్వారానే పౌర సేవలు అందాయి. వలంటీర్లు కూడా తమకు అప్పగించిన బాధ్యతలు అంకితభావంతో నిర్వర్తించి అందరి మన్ననలు పొందారు. ఎండా, వాన, చలి లెక్కచేయకుండా సేవలందించారు. కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి మరీ వలంటీర్లు సేవలు అందించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఎన్నికల ప్రకటనకు ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు చేశారు. అమ్మాయిలను మాయం చేస్తున్నారనీ, వలంటీర్ల వ్యవస్థ అమలులోకి వచ్చాక రాష్ట్రంలో వేల సంఖ్యలో అమ్మాయిలు మాయమయ్యారనీ, అందుకు వలంటీర్లే బాధ్యులని అప్పట్లో పవన్ కల్యాణ్ చేసిన విమర్శలు సంచలనం సృష్టించాయి. ఎన్నికలకు నెలముందు కొన్ని ఫిర్యాదులు రావడంతో వలంటీర్లను సంక్షేమ పథకాల పంపిణీకి దూరంగా ఉంచారు. నామ మాత్రంగా సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీ కొనసాగించారు. దీంతో వలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందా అనే సందేహాలు అప్పుడే మొదలయ్యాయి. అయితే, టీడీపీ కూటమి ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల జీతం నెలకు పది వేల రూపాయలకు పెంచుతామని ప్రకటించి డోలాయమానంలో ఉన్న వలంటీర్లలో ఆశలు సజీవంగా ఉంచింది. ఎన్నికలకు ముందు దాదాపు లక్షమంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరిలో అప్పటి ప్రభుత్వ ఒత్తిడి మేరకు రాజీనామా చేసిన వారి సంఖ్య గణనీయంగా ఉందన్న వార్తలు వచ్చాయి. అధికారంలోకి వచ్చి 150 రోజులైనా వలంటీర్లకు ఎలాంటి విధులు అప్పగించలేదు. దానితో తమ విధులకు సంబంధించి ఆందోళనకు గురైన వలంటీర్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)కు అనుబంధంగా ఆంధ్ర ప్రదేశ్ వలంటీర్ అసోసియేషన్ ఏర్పాటుచేసుకుని కలెక్టరేట్‌ల చుట్టూ తిరిగి వినతి పత్రాలు సమర్పించారు. బాల వీరాంజనేయ స్వామి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత దాదాపు మూడు సార్లు వలంటీర్ల అంశం ప్రస్తావించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్ల జీతం పదివేలు చేస్తామని, వారిని కొనసాగిస్తామని చెప్పారు. బుధవారం మండలిలో మాట్లాడుతూ అందుకు భిన్నంగా ప్రకటన చేశారు. వలంటీర్ల వ్యవస్థ రికార్డుల్లో లేదని మొదట ప్రకటించిన వారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. రికార్డుల్లోనే లేనప్పుడు వలంటీర్లు ఎవరు? వారికి జీతాలు ఇవ్వడం ఏమిటి? వారిని కొనసాగించడం ఏమిటని ఒక సభలో పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో 'వలంటీర్ల గౌరవ వేతనం పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా' అని వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థే లేదని, లేని వలంటీర్లను తాము కొనసాగించలేమని మంత్రి బాల వీరాంజనేయ స్వామి తేల్చిచెప్పారు. 2023 ఆగస్టు నుంచి వలంటీర్ల వ్యవస్థ ఉనికిలో లేదని, వారికి సంబంధించి గత ప్రభుత్వం జీవో ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు వారితో రాజీనామా చేయించారని, రాష్ట్రంలో ప్రస్తుతం వలంటీర్లు లేరని తెలిపారు. గత ప్రభుత్వం జీవో ఇచ్చి ఉంటే వలంటీర్ వ్యవస్థను కొనసాగించి వేతనాలు పెంచే వాళ్లమని, మే నెల వరకు వలంటీర్లకు వేతనాలు చెల్లించామని చెప్పారు. ఇటీవల వరదలు వచ్చినప్పుడు రాజీనామా చేసినవారు తప్ప మిగిలిన వలంటీర్లు విజయవాడలో సచివాలయ సిబ్బందికి సహకారంగా పనిచేశారు. గతంలో ఏ ఇంటికి ఏ అవసరం ఉందన్నా వారే సచివాలయ సిబ్బందితో మాట్లాడి పనులు చేయించారు. వేకువజామునే ఇంటింటికీ వెళ్లి పించన్లు పంచారు. ఏ పనినైనా ప్రజల వద్దకు వెళ్లి చేశారు. ఆ వ్యవస్థే ఇప్పుడు లేదనటం ఏమిటనే చర్చ మొదలైంది. బడ్జెట్ లేకుండా 2023 సెప్టెంబరు నుంచి వలంటీర్లతో పనులు ఎలా చేయించుకుంటున్నారన్న ప్రశ్నలు వ్యక్తమౌతున్నాయి. వలంటీర్లతో పని చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ లేదని చెప్పడం సరికాదు.

గత ప్రభుత్వం వలంటీర్లకు నెలకు రూ.5వేలు మాత్రమే ఇచ్చి బండచాకిరీ చేయించుకుంది. డిగ్రీలు, పీజీలు, బీటెక్ చేసిన యువత ప్రభుత్వ సర్వీస్ అవుతుందనే ఆశతో తక్కువ వేతనానికే పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పనులను వారితో ఊపిరిసల్పకుండా చేయించుకుంది తప్ప వారికి ఒరగబెట్టింది శూన్యం. ప్రస్తుత ప్రభుత్వం వేతనం పెంచుతామని ఆశజూపి చివరికి నట్టేట ముంచుతామని ప్రకటించడం ఏమాత్రం సమంజసం కాదు. వలంటీర్లు చేసే పనులు ఇతర ఉద్యోగులతో తాత్కాలికంగా చేయించవచ్చు కానీ, ఎల్లవేళల అది సాధ్యంకాదు. గత ప్రభుత్వం నియమించిందనే కారణంతో వీరిని తొలగిస్తే ప్రస్తుత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకతప్పదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేయాలి. గత ప్రభుత్వం వలంటీర్‌ల నియామకాలు పద్ధతి ప్రకారం చేయకపోతే ఇచ్చిన హామీ ప్రకారం ఉన్న వలంటీర్లను కొనసాగిస్తూ వాళ్లకు ఉద్యోగ భద్రత కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతోపాటు గత ఐదు నెలలు బకాయిలు చెల్లించి రూ.10 వేల గౌరవవేతనం ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వలంటీర్లను కొనసాగేలా మానవతా హృదయంతో చర్యలు తీసుకోవాలి.

# అనుచరణ వద్దు- ఆలోచన ముద్దు

ప్రస్తుత సమాజం పోకడలు గమనిస్తే సమాజం అంధకారమయంగా కనిపిస్తోంది బావ. అవునయ్యా యువత అనుచరణ మాని ఆలోచిస్తే తప్ప మార్పు ఊహించలేము. ఒక ఆలోచనతో రాజ్యాధికారం చేజిక్కించుకోవచ్చు. ఒక ఆలోచన వల్ల చరిత్రను తిరగరాయవచ్చు. తద్వారా దేశ గతిని మార్చవచ్చు. అసలు ఆలోచన లేకుంటే అభివృద్ధి శూన్యం. ఒక సైంటిస్టు ఆలోచన వలనే చంద్రునిపై కాలిడగలిగాం. జంతువుల వలే కాక మానవుడు ఆలోచించబట్టి ఆటవిక దశ నుంచి నాగరికుడుగా మారి సమాజ అభివృద్ధికి దోహదకారి కాగలిగాడు. ఆలోచించకుండా పెద్దలను, నాయకులను అనుసరిస్తే ప్రగతి శూన్యం. ప్రస్తుతం మూస పద్ధతిలో రాజకీయాలు జరుగుతున్నాయి. సమాజాభివృద్ధి మందగమనంలో సాగుతోంది. ఒక శాతం మంది ఆర్థికంగా పెరిగితే దాన్ని అభివృద్ధిగా పరిగణించడం హాస్యాస్పదం. 80 శాతం మంది జీవన ప్రమాణం పెరిగితేనే దాన్ని అభివృద్ధి అనాలి. అభివృద్ధి మందగమనానికి కారణం యువత ఆలోచించకుండా నాయకులను గుడ్డిగా అనుసరించడమే. ఆలోచించడం మానినవాడు సమాజం తిరోగమనంలో ఉన్నట్లు భావించాలి. ప్రస్తుతం ఆలోచించని మూర్ఖులే ఆలోచనాపరుల్ని హతమారుస్తున్నారు. ఆలోచించకుండా నాయకుల ఆదేశాలు పాటించడమే అందుకు కారణం. ఆలోచనలేని ఆచరణకు స్వావలంబన ఊహించలేం. నాయకుల నిర్ణయాలను




ప్రశ్నించకుండా ఆచరించే వారంతా అనుచరులే. అనుచరగణం తమ మేధస్సును నాయకులకు తాకట్టు పెట్టడంతో సమాజం అభివృద్ధికి నోచుకోకుండా పోతోంది. ఈ రకంగా సమాజంలో ప్రవక్తలు, పీఠాధిపతులు, రాజకీయ నాయకులు చెప్పింది చేయడానికి అలవాటుపడిన అనుచరగణం ఆలోచించకుండా ఆచరణవాదులుగా మారిపోతున్నారు. ఆలోచన ఐచ్ఛికంగా చేసేది కనుక వారి వారి ఇష్టాలకు వదలకుండా గుడ్డిగా అనుసరించే విధంగా యువతను నాయకులు మారుస్తున్నారు. చెప్పింది చేయండి అనేకంటే ఏం చేస్తే బాగుంటుందని యువతను అడిగితే వారు బుర్రకు పదునుపెట్టి ఆలోచించి వారి ఆలోచనలు బహిర్గతం చేయడానికి అవకాశం ఉంటుంది. దాంతో వారి మేధస్సు వికసించి తప్పుడు నిర్ణయాలు కాకుండా సన్మార్గాన నడచి అభివృద్ధికి బాటలు వేయగలుగుతారు. నిజమే బావ ఆలోచించకుండా నిరోధించేవన్నీ మత విధానాలే. మత పెద్దలు చెప్పింది విని వారికి భజనచేయడం తప్ప ఆచరణ వల్ల కలిగే కష్టనష్టాలు ఆలోచించరు. ఏ రంగంలోనైనా అభిప్రాయాలు వ్యవస్థీకరణ పొందితే వాటి నుంచి బయటపడే ఆలోచనచేసే స్వేచ్ఛను కోల్పోవడం జరుగుతోంది. పాత ప్రాచీన భావ సముదాయాన్ని సమర్థించి ఆచరించడానికి అనేక మార్గాలు మతస్థులు చూపెట్టగలరు. వారు అనుకున్నది సమర్థించడంకోసం యువత అనుకునేది నిర్మూలించడం కోసం అనేక ఉపాయాలు మతం మన ముందు పెడుతుంది. వస్తువులను ఆస్తులుగా పరిగణించినట్టే ఇతరులు ముఖ్యంగా అభ్యుదయవాదుల భావాలను కూడ వారి ఆస్తులుగా పరిగణించి వారి నోటికి తాళం వేస్తుంది మతం. మనిషి తన భావపరమైన ఆస్తిని మరొకరికి తాకట్టు పెట్టడం ఘోరమైన విషయం. వస్తుపరమైన ఆస్తి పోయినా మరల సమకూర్చుకోవచ్చు. కాని ఒక మేధావి నుంచి వచ్చే భావాలను నిరోధించడం, మతస్థులకో, రాజకీయ నాయకులకో తాకట్టు పెట్టడం సహించరాని విషయమే కాని అది అహేతుకం. భావస్వాతంత్ర్యం అన్ని కాలాల్లోనూ అందరికి అవసరం అనే విషయం అందరూ అంగీకరించవలసిన విషయం. మతవాదులు ఒకప్పుడు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందనే విషయం దుష్టపరమైనదిగా పరిగణించారు. ఆ సత్యాన్ని వెల్లడించిన వారిని మతస్థులు ఆనాడు భూస్థాపితంచేసి ఉంటే ఈనాడు విజ్ఞానశాస్త్రం ఈ స్థాయికి చేరుకునేది కాదు. అందువలన భావప్రకటనను నిరోధించడం మానవ లక్షణం కారాదు. ఏ భావాలు స్వీకరించాలి ఏవి వదలివేయాలి అనే విచక్షణ మానవునికి వదలివేయాలి. ఆ స్వేచ్ఛ ప్రతి మనిషికి అవసరంగా గుర్తించాలి.

ఈనాడు మతం మనిషిని మత్తులో ముంచి అజ్ఞాన దశలోకి నెట్టి ఆలోచించడానికి తావు లేకుండా చేసి గుడ్డిగా ఆచరించేటట్లు చేస్తోంది. అలాగే రాజకీయాల్లో కూడా ఆలోచనకు స్వస్తి పలికి నాయకులు చెప్పింది తు.చ. తప్పకుండా అనుచరగణం ఆచరిస్తోంది. దీనివల్ల మెదడును తాకట్టు పెట్టి జంతువుల వలే ఆలోచన చేయకుండా అనుసరించడం జరుగుతోంది. అనేక ప్రలోభాలకు లోనై స్వార్థం కొద్ది నాయకులను అనుసరించడం వల్ల అధినాయకుడు తప్పుచేస్తే ఆ ప్రభావం మొత్తం జాతిపై పడుతోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరు ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ లాంటి వాటిల్లో యిరుక్కుని కేంద్రానికి భయపడి వ్యవహరించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు గండిపడుతోంది. దాంతో రాష్ట్ర అభివృద్ధి నత్తనడకన నడుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కాంగ్రెసు కావడంతో మరింత ఇబ్బందులు కేంద్రంతో తప్పని పరిస్థితి. ఈ పరిస్థితిలో యువత అనుసరణకు స్వస్తి పలికి ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అవసరం. అలా జరిగినపుడే యువత రాష్ట్రాభివృద్ధికి దోహదకారులు కాగలరు. అందుకే యువతా మేలుకో అని నినదించవలసిన సమయం ఆసన్నమయింది. జాతి భవిత యువతపైనే ఆధారపడి ఉంది.

సెల్: 9885569394

# అదానీ విద్యుత్ అవినీతి బండారం

డా॥సోమ మర్ల

సోలార్ విద్యుత్ అమ్మకాలకై భారత ప్రభుత్వ అధికారులకు దాదాపు రెండువేల కోట్ల (250 మిలియన్ డాలర్ల) లంచం ఇవ్వజూపాడని గౌతమ్ అదానీపై అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషను, అటార్నీ జనరల్ తీవ్ర అభియోగాలు చేశాయి. ఇటీవల గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలు అమెరికాలో నెలకొల్పటానికి 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టి పదిహేనువేల మంది అక్కడి పౌరులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని గౌతమ్ అదానీ ప్రకటించారు. అమెరికాలో వ్యాపారం చేసే విదేశీ కంపెనీలు తప్పుడు ప్రకటనలు, అవినీతికి పాల్పడితే ఆ కంపెనీలపై న్యాయబద్ధమైన చర్యలు చేపట్టటానికి అక్కడి చట్టాలు తోడ్పడతాయి. కాగా భారత్‌లోని అనేక రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్) అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీకి విశాలమైన సోలార్ పార్కులున్నాయనీ, అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను దేశంలోని వివిధ రాష్ట్రాలకు లాభదాయకంగా విక్రయిస్తున్నామని ఈ సంస్థ ప్రకటించుకున్నది. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వ అధికారులకు విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకునేందుకు తోడ్పడవల్సిందిగా దాదాపు 250 మిలయన్ డాలర్ల లంచాలు ఇవ్వజూపారనేది ప్రధాన అభియోగం. ఇందులో భాగంగా అమెరికాలో మదుపర్ల నుంచి పెట్టుబడులు సేకరించే క్రమంలో అసత్య ప్రకటనలు చేసిన కారణంగా గౌతమ్ అదానీ మేనల్లుడు, వినీత్ జైన్ తదితర అదానీ అమెరికా గ్రీన్ ఎనర్జీ కంపెనీ నిర్వాహకులపై ఈ అభియోగాలు చేశారు.

విశేషమేమిటంటే, 2022వ సంవత్సరంలో అదానీ సంస్థలో ఉత్పత్తి చేసిన విద్యుత్ కొనుగోలుకై అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని ఆ మర్నాడే అప్పటి రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. కాగా గోప్యంగా ఉంచిన ఈ ఒప్పందం వివరాలను బహిర్గతం చెయ్యాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి డిమాండు చేసింది. అదానీ సంస్థ నుంచి మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధర చెల్లించికొనే విద్యుత్‌తో రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగి వినియోగదారులు నష్టపోతారని కూడా కమ్యూనిస్టు పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇండియా టుడే (నవంబరు 21, 2024) కథనం ప్రకారం 2021-2023 సంవత్సరాల మధ్య విద్యుత్ కొనుగోళ్లకు, భారత ప్రభుత్వ అధికారులకు చెల్లించిన దాదాపు 265 మిలియన్ డాలర్ల మొత్తంలో అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక అధికారికి చెల్లించినట్లు ఇ-మెయిల్, ఫోన్‌కాల్స్ వివరాలతో అమెరికా విచారణ సంస్థలు పేర్కొన్నాయి. ఈ విక్రయాల ద్వారా అదానీ సంస్థకు



కేవలం లాభం రూపంలోనే దాదాపు 2బిలియను డాలర్లు లభించగలవని కూడా పేర్కొంది.

దేశంలోని ప్రభుత్వ ఆస్థులైన బొగ్గు, ఖనిజాలకు సంబంధించిన గనులను ఇటీవల కాలంలో ప్రస్తుత భారతీయ జనతా పార్టీ

> **2022వ సంవత్సరంలో అదానీ సంస్థలో ఉత్పత్తి చేసిన విద్యుత్ కొనుగోలుకై అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని ఆ మర్నాడే అప్పటి రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. కాగా గోప్యంగా ఉంచిన ఈ ఒప్పందం వివరాలను బహిర్గతం చెయ్యాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి డిమాండు చేసింది.**

ప్రభుత్వం అతి చౌకగాను లేదా దాదాపు ఉచితంగాను కట్టబెడుతున్నది. దీనిలో భాగంగానే జార్ఖండ్ రాష్ట్రంలోని గొడ్డా జిల్లాలో ఉన్న అపారమైన బొగ్గు గనులను అదానీ పవర్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం బదలాయించింది. దాదాపు 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక కేంద్రాన్ని ఈ కంపెనీ గొడ్డాలో స్థాపించింది. తయారయిన విద్యుత్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విక్రయించటానికి ఒప్పందాన్ని సైతం అప్పటి ప్రధాని హసీనా బేగంతో చేసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం తోడ్పడింది. అదే విధంగా ఆస్ట్రేలియాలో సైతం బొగ్గు గనులను అదానీ పవర్ కంపెనీ కొనుగోలు చేసింది. విశేషమేమిటంటే ఇతర వనరులు కలిగి ఉన్నా, రాష్ట్ర విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు విధిగా ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకొనే బొగ్గును కొనితీరాలి. ఈ ధర స్థానిక మార్కెట్ విలువ కంటే రెండున్నర రెట్లు ఉండటాన్ని గమనించాలి. ఉదాహరణకు 2019లో తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి అదానీ పవర్ ఆస్ట్రేలియా నుంచి దిగుమతులైన బొగ్గు నుంచి స్టాక్ మార్కెట్ కన్నా రెండు రెట్లు అధికంగా చెల్లించి కొనుగోలు చెయ్యవల్సి వచ్చింది. విశేషమేమంటే గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుదుర్చుకొన్న ఒప్పందాన్ని ప్రస్తుత చంద్రబాబునాయుడు ప్రభుత్వం కొనసాగించటం. దీనివలన రాష్ట్రంలో అదానీ సోలార్ విద్యుత్ సరఫరా కారణంగా విద్యుత్ మీటర్లు అమర్చిన తర్వాత దాదాపు 50 నుంచి 100 శాతం యూనిట్‌పై ఛార్జీలు పెరిగే అవకాశం ఉంది.

ఒకపక్క పర్యావరణానికి హానికలిగించని సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నా అవి అదానీ సంస్థలుగా చెప్పుకుంటున్నా, వేరొక పక్క విషపూరిత హరిత వాయువులను విడుదలచేసే శిలాజ ఇంధనం బొగ్గు ఉత్పత్తిని అధికంగా వినియోగించి విద్యుత్ తయారుచేస్తున్నది అదానీ పవర్ సంస్థ. పర్యావరణానికి మేలుచేసే 'గ్రీన్ వాషింగ్' టెక్నాలజీ ద్వారా విద్యుత్, హైడ్రోజన్ తదితర ఇంధనాలను ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రకటించుకుంటున్నా, బొగ్గు వినియోగం పెంచడం ద్వారా జరిగే పెరిగే భూతాపం ప్రమాదమే హెచ్చుగానున్నది.

ఉదారవాద ఆర్థిక విధానాల అమలులో భాగంగా ప్రభుత్వాలు కొందరు పారిశ్రామికవేత్తలకు, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను కట్టబెట్టడం వలన ఒనగూరే అవినీతి కారణంగా ప్రజలు అధిక వ్యయం చెల్లించుకోవాల్సి వస్తున్నది.

# దిసన్నాయకే మార్గం అనుసరణీయం

పి.సుధీర్

శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో వామపక్షం గొప్ప విజయం సాధించింది. ఈ సంవత్సరం సెప్టెంబరులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష పథాన నడుస్తున్న అనుర కుమార దిసన్నాయకే అఖండవిజయం సాధించారు. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) అభ్యర్థిగా మొదటిసారి దిసన్నాయకే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇంతవరకు పాలించిన వారంతా దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణమయ్యారు. శ్రీలంకను ఆర్థిక సంక్షోభం నుంచి బైటవేస్తానని వాగ్దానంచేసి దిసన్నాయకే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించారు. దిసన్నాయకే వాగ్దానాన్ని నెరవేర్చగలరన్న విశ్వాసంతో ప్రజలు ఎన్‌పీపీ పార్టీకి తిరుగులేని విజయం అందించారు. దామాషా ప్రాతినిధ్యం ప్రాతిపదికన పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. పార్లమెంటులో 225 స్థానాలుండగా, ఎన్‌పీపీ 159 సీట్లను గెలుచుకుంది. 61.6శాతం ఓట్లు పోలయ్యాయి. 2020 ఎన్నికల్లో ఎన్‌పీపీకి మూడుసీట్లు మాత్రమే ఉన్నాయి. దిసన్నాయకే అధ్యక్ష ఎన్నికల్లో 42శాతం ఓట్లతో రెండవ ప్రాధాన్యత ఓటుతో గెలుపొందారు. ముందుగా వాగ్దానం చేసినట్లుగానే దిసన్నాయకే అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే పార్లమెంటును రద్దుచేశారు. నవంబరు 14వతేదీన పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. 2019లో ఎన్‌పీపీ ఏర్పడింది. ఈ పార్టీలో మార్క్సిస్టు పార్టీ జనతా విముక్తి పెరుమన (జేవీపీ) తోపాటు మరో 20 రాజకీయ పార్టీలు, ట్రేడ్‌యూనియన్లు, సామాజిక గ్రూపులు కూడా చేరాయి. జేవీపీకి చెందిన దిసన్నాయకే ఎన్‌పీపీకి నాయకత్వం వహించారు. అధ్యక్షుడు దిసన్నాయకే నాయకత్వంలో పార్లమెంటు ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించారు. శ్రీలంక పార్లమెంటులో ఇదొక గొప్ప పరిణామం. మేధావులు, రాజపక్సకు చెందిన ఎస్ఎల్‌పీపీ, చీలికకు గురైన ఎస్ఎల్ఎఫ్‌పీ, రణిల్ విక్రమ సింఘే నాయకత్వంలోని మాజీ యునైటెడ్ నేషనల్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో దాదాపు అంతర్థానమయ్యాయి. ప్రేమదాస నాయకత్వంలోని ఎస్ఎల్‌బీ మాత్రమే పార్లమెంటులో 40సీట్లను గెలుపొందింది.



ఎన్‌పీపీ 22ఎలక్టొరల్ జిల్లాలకు 21జిల్లాలలో గెలుపొందింది. జాఫ్నా, వన్ని తమిళజిల్లాలలో ఎన్‌పీపీ మంచి విజయం సాధించింది. ఈ ప్రాంతంలోని ఇల్లంకయ్, తమిళ్ అరసు, కచ్చి(ఐటిఏకే) తదితర తమిళపార్టీలు విఫలమై ఎన్‌పీపీ గెలుపొందింది. గణనీయంగా ముస్లింలు ఉన్నటువంటి అంపర, ట్రింకోమలి పార్టీలు కూడా ఎన్‌పీపీ చేతిలో ఓడిపోయాయి. అలాగే కేంద్రీయ ప్రాంతంలో గణనీయంగా తమిళ ప్లాంటేషన్ కార్మికులు ఉన్న ప్రాంతంలో ఎన్‌పీపీ మంచి ఫలితాలు పొందింది. దక్షిణ ప్రాంత జిల్లాలో ఎన్‌పీపీ ఇతర పార్టీలను పూర్తిగా ఓడించింది. జాతులు, మతాలకు చెందిన ప్రజలు ఎన్‌పీపీకే ఓటు చేశారు. 2022లో ఆర్థికంగా పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా ఎన్‌పీపీ, జేవీపీ మంచి ఆదరణపొందాయి. అరగలయ సంఘం నాయకత్వంలో ప్రజాసమూహాలు తిరుగుబాటు చేశాయి. అవినీతిలో మునిగిపోయిన రాజపక్స వంశీకులు దేశాన్ని లూటీ చేశారు. ప్రజాసమూహాల తిరుగుబాటు సందర్భంగా ఎన్‌పీపీ ప్రధానపార్టీగా తయారైంది. రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. ప్రజల హక్కులు, అలాగే జీవనభృతి గణనీయంగా హరించుకుపోయాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దిస్సనాయకే పనిచేశారు. ప్రధానమైన రాజకీయపార్టీల నాయకులు అవినీతిలో మునిగిపోయారు. దిస్సనాయకే, ఎన్‌పీపీ ఆర్థిక వ్యవస్థను వృద్ధిచేసేందుకు పార్లమెంటు ఎన్నికల్లో విజయం అవసరమైంది.

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రాజ్యాంగం, రాజకీయ సంస్కరణలను రూపొందించి ప్రత్యామ్నాయ విధానాలను అమలుచేస్తోంది. అధ్యక్షుడుగా ఎన్నికైనప్పుడు దిసన్నాయకేకు పార్లమెంటులో ఎక్కువగా సీట్లులేవు. తాజాగా జరిగిన ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజారిటీని సాధించారు. 21మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేశారు. డాక్టర్ హరిణి అమరసూర్య ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

పార్లమెంటు ఎన్నికలు జరగడానికి ముందు తాను అనుసరించబోయే సమగ్ర విధానాలను దిసన్నాయకే ప్రకటించలేదు. ఇక ఇప్పుడు ఆర్థికవ్యవస్థను మెరుగుపరచేందుకు వీలైన విధానాలను రూపొందించనున్నారు. అత్యధిక ధరలు, జీవన వ్యయం, పౌర స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య హక్కులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ప్రధాన ఆర్థిక అజెండాను రూపొందించి అమలు చేయనున్నారు. ప్రజల ఆర్థికవనరులను కొల్లగొట్టిన వారి నుంచి వసూలు చేస్తానని, నూతన రాజ్యాంగాన్ని రూపొందిస్తానని, ఎగ్జికూటివ్ అధ్యక్ష స్థానాన్ని పూర్తిగా తొలగిస్తామని దిసన్నాయకే వాగ్దానం చేశారు. 21మంది మంత్రులకంటే ఎక్కువమంది మంత్రులను చేర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆర్థికవ్యయాన్ని తగ్గించడంకోసం తక్కువమంది మంత్రులను తీసుకున్నారు. ఐఎమ్ఎఫ్ నుంచి 2.9 బిలియన్ డాలర్ల రుణాన్ని గత ప్రభుత్వాలు చేశాయి. ఇందులో రెండు విడతలు మాత్రమే చెల్లించారు. తీవ్రమైన ఆంక్షలను ఐఎంఎఫ్ విధించింది. ఇప్పుడు ఎన్‌పీపీ ప్రభుత్వం ఆర్థికరంగాన్ని పునరుద్ధరించవలసి ఉంది. ప్రజానుకూలమైన అభివృద్ధి చర్యలను చేపట్టాలి. నయా ఉదారవాద పద్ధతుల్లో శ్రీలంక ఆర్థిక వ్యవస్థను నడపవలసిఉంది. పశ్చిమ రాజ్యాలు, అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడులతో దేశాన్ని బ్లాక్‌మెయిల్ చేయకుండా తగిన చర్యలు చేపట్టాలి. తమిళులు, ముస్లిం మైనారిటీల నుంచి ఎన్‌పీపీకి మంచి ఆదరణ లభించింది. వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్‌తో ఎన్‌పీపీ సమానమైనది. భారతదేశంలోని వామపక్ష రాజకీయపార్టీలు కూడా దిసన్నాయకే అనుసరించిన విధానాలను అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం.

# అదానీ కుంభకోణాలపై జేపీసీ

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్
- సీబీఐ దర్యాప్తు జరిపించాలి: సీపీఎం

**న్యూఢిల్లీ:** అమెరికాలో అదానీ కుంభకోణంపై ప్రతిపక్షాలు గట్టిగా స్పందిస్తున్నాయి. అదానీ గ్రూపుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని(జేపీసీ) ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మరోసారి డిమాండ్ చేసింది. అదానీ గ్రూపు కార్యకలాపాలు, విదేశాల్లో పెట్టుబడులు, భారతదేశంలో ఉద్దేశపూర్వక సంస్థాగత కోతకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా సంయుక్త పార్లమెంట్ కమిటీ (జేపీసీ) విచారణ చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అగ్రశ్రేణి భారతీయ వ్యాపారవేత్తపై వేరొక దేశం అభియోగాలు మోపినప్పుడు, అది ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్టను దిగజార్చిందని అన్నారు. "కీలక రంగాలలో గుత్తాధిపత్యాన్ని సృష్టించడం అనవసరమైన ప్రోత్సాహాలు ఇవ్వడం ద్వారా సంపదను కొందరి చేతుల్లో కేంద్రీకరించడం వంటి మోదీ ప్రభుత్వం కొంతమంది వ్యక్తులకు లాభం చేకూర్చే, ప్రోత్సహించే అనైతిక వ్యాపార పద్ధతులపై కాంగ్రెస్ నిరంతరం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది" అని ఖర్గే 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. 'మోదానీ' స్కామ్స్‌పై జేపీసీ ఏర్పాటుచేయాలని 2023 జనవరి నుంచి డిమాండ్ చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ గుర్తు చేశారు. ప్రధాని మోదీకి, ఆయనకు ఎంతో ఇష్టమైన వ్యాపారవేత్తకు ఉన్న సంబంధాలపై "హమ్ అదానీ కే హైన్ కౌన్?" సిరీస్‌లో భాగంగా ఎన్నో ప్రశ్నలు సంధించినట్లు జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఆ ప్రశ్నలకు ఇంకా సమాధానం లభించలేదని విమర్శించారు. సీబీఐ దర్యాప్తు జరిపించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వ అధికారులకు ఇంత పెద్ద ఎత్తున లంచం ఇవ్వడాన్ని భారత్ కాకుండా అమెరికా బహిర్గతం చేయడం సిగ్గుచేటని పేర్కొంది. అమెరికా చెప్పిన అంశాల ఆధారంగా కేసు నమోదు చేయడానికి సీబీఐ ఆదేశించాలని తెలిపింది.

**సమగ్ర దర్యాప్తు జరపాలి: ఫరూఖ్ అబ్దుల్లా**

కేంద్రం ఈ విషయాన్ని తీవ్రంగా తీసుకుని, సమగ్ర దర్యాప్తు ఆదేశిస్తుందని భావిస్తున్నట్లుగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అదానీ గ్రూపునకు సంబంధించిన సమస్య గురించి తన వద్ద పెద్దగా సమాచారం లేదని, గతంలో కూడా తప్పు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని ఆయన అన్నారు. 'అది జరిగితే, దానిపై విచారణ అవసరం' అని అబ్దుల్లా స్పష్టం చేశారు.

**అదానీని కేజ్రీవాల్ అడ్డుకున్నారు...**

దిల్లీ ఇంధన రంగంలోకి ప్రవేశించాలని అదానీ గ్రూప్ ఎంతగానో ప్రయత్నించిందని ఆమ్‌ఆద్మీపార్టీ నేత సంజయ్ సింగ్ వెల్లడించారు. అయితే ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ దానిని అడ్డుకున్నారని తెలిపారు. "అదానీ గ్రీన్ ఎనర్జీ గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో పవర్ సప్లై కాంట్రాక్టులు దక్కించుకుంది. దిల్లీ ఎలక్ట్రిసిటీ మార్కెట్‌లోకి ప్రవేశించాలని ప్రయత్నించింది. కానీ వీలుపడలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు" అని తెలిపారు. బీజేపీ దిల్లీలో అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెరగొచ్చని హెచ్చరించారు. తాజా వ్యవహారంపై తాము మౌనంగా కూర్చోబోమని, త్వరలో ప్రారంభంకానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు.

– అదానీపై అమెరికాలో లంచం, మోసం కేసు విషయమై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే స్పందిస్తూ... మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రమేయం ఉందా అని ప్రశ్నించారు. నేరారోపణ వార్తలపై మార్కెట్లు స్పందిస్తుండగా... ప్రభుత్వం ఈ అంశంపై నిశ్శబ్దంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

## అదానీ గ్రూప్స్ షేర్ల పతనం

**న్యూఢిల్లీ:** న్యూయార్క్‌లో కేసుతో స్టాక్‌మార్కెట్లో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు గురువారం కుప్పకూలాయి. గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, వినీత్ ఎస్.జైన్‌తో పాటు సహచరులపై లంచం, సెక్యూరిటీల మోసానికి సంబంధించి న్యూయార్క్‌లో కేసు నమోదైంది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రారంభంలో అత్యధికంగా 20 శాతం తగ్గి రూ.687కి చేరింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 10 శాతం పతనమై రూ.2539.35 వద్ద ప్రారంభమైంది. అదానీ పోర్ట్స్, స్పెషల్ ఎకనామిక్ జోన్‌లు ఒక్కో స్టాక్‌కు 10 శాతం పతనమై రూ.1670కి చేరాయి. అదానీ పవర్ లిమిటెడ్ స్టాక్‌లు ఒక్కొక్కటి సుమారు 11 శాతం పతనమై రూ.467.4కి చేరాయి. అదానీ గ్రీన్‌ఎనర్జీ 16 శాతం క్షీణించి రూ.1184.25కి చేరుకోగా, అదానీ టోటల్ గ్యాస్ 12 శాతం తగ్గి రూ.589.9కి పడిపోయింది. అంబుజా సిమెంట్స్ 14.99 శాతం క్షీణించగా, ఏసీసీ 14.54 శాతం, ఎన్‌డీటీవీ 14.37 శాతం, అదానీ విల్మార్ 10 శాతం క్షీణించాయి. మొత్తంగా గ్రూప్ కంపెనీ మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుండి 12.42 లక్షల కోట్లకు పడిపోయినట్లు ఓ నివేదిక పేర్కొంది. కాగా, అదానీ షేర్ల పతనంతో స్టాక్‌మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ సైతం నష్టాల్లో కొనసాగాయి. అదానీ గ్రూప్స్ స్టాక్స్‌లో భారీ పతనం, విదేశీ నిధుల తరలింపు కారణంగా స్టాక్‌మార్కెట్‌లో సెన్సెక్స్, నిఫ్టీ పతనమయ్యాయి. ప్రారంభట్రేడింగ్‌లో సెన్సెక్స్ 468.17 పాయింట్లు పతనమై రూ.77,110.21కి చేరుకుంది. నిఫ్టీ 179.75 పాయింట్లు క్షీణించి రూ.23,338.75 వద్దకు చేరుకుంది.

## మోదీ ప్రతిష్ఠను దిగజార్చేందుకే...

### రాహుల్ ఆరోపణలపై బీజేపీ

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ ఉండగా... అదానీ అరెస్టు కారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర స్పందించారు. దేశంపై, దానిని రక్షించే వారిపై దాడి చేయడం రాహుల్ గాంధీకి అలవాటేనన్నారు. ప్రధాని మోదీ ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాహుల్ ప్రయత్నిస్తారన్నారు. "అదానీ గ్రూపుపై అమెరికా ఆరోపణలకు సంబంధించి, స్పష్టత ఇవ్వడం, స్వీయరక్షణ చేసుకోవడం ఆ కంపెనీకి సంబంధించిన విషయం. అదానీ గ్రూపు లంచం ఇచ్చిందని ఆరోపణలున్న రాష్ట్రాల్లో ఒక్క బీజేపీ ముఖ్యమంత్రి కూడా లేరు. 2019లో కూడా ఇదే తరహాలో రాఫెల్ విషయంలో చేశారు. కోవిడ్ వాక్సిన్‌పై ఇదే పద్ధతిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కానీ ఆ తర్వాత సుప్రీం కోర్టు ముందు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది" అని సంబిత్ పాత్రా పేర్కొన్నారు.

**మాకు ఎన్నో అనుమానాలున్నాయ్: మాలవీయ**

పార్లమెంటు సమావేశాల ముందు గౌతమ్ అదానీపై కేసు ప్రస్తావన రావడంపై బీజేపీ మండిపడింది. ఈ చర్య అనేక అనుమానాలకు తావిస్తోందని బీజేపీ ఐటీ విభాగాధిపతి అమిత్ మాలవీయ అన్నారు. అదానీపై ఆరోపణలుచేస్తున్న అమెరికా పెట్టుబడిదారు జార్జ్ సొరోస్‌కు కాంగ్రెస్ ఆసరాగా నిలుస్తోందని మాలవీయ ఆరోపించారు. 2021 జులై నుంచి 2022 ఫిబ్రవరి వరకూ అదానీ గ్రూపు లంచం ఇచ్చినట్లు చెబుతున్న అధికారులు ఉన్న రాష్ట్రాలన్నీ ప్రతిపక్ష పార్టీలు పాలించినవేనని పేర్కొన్నారు. వాటిలో ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయని వివరించారు. అందుకే కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షాలు లంచం తీసుకున్నట్లు అంగీకరిస్తున్నారా అని మాలవీయ ప్రశ్నించారు. 2021-2022 కాలంలో ఏపీలో వైసీపీ, ఒడిశాలో బీజేడీ, తమిళనాడులో కాంగ్రెస్ మిత్రపక్షం డీఎంకే, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. ఆరోపణలు చేసేముందు అమెరికా కేసు డాక్యుమెంట్‌ను ఒకసారి చదువుకోవాలని కాంగ్రెస్ నాయకులకు బీజేపీ నేత మాలవీయ సూచించారు.

# ఎగ్జిట్ పోల్స్ వంచన!

### సర్వేలకు భిన్నమైన ఫలితాలొస్తాయ్: ప్రతిపక్షం

### గెలుపుపై మహాయుతి, మహా వికాస్ అఘాడీ దీమా

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో ముగిశాయి. పోలింగ్ పూర్తి అయిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. చాలా సర్వేలు ఎన్డీయేకు మొగ్గు చూపాయి. కొన్ని మాత్రం ఎవరికీ పూర్తి మెజారిటీ రాదన్నాయి. ఒక సర్వే మాత్రమే మహా వికాస్ అఘాడీ(ఎంవీయే) గెలుపును అంచనా వేసింది. ఎగ్జిట్ పోల్స్‌పై రాజకీయ పార్టీలకే నమ్మకం కుదరడం లేదు. అవి మోసపూరితమని, వంచన అని విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇంతకుముందు హర్యానా, జమ్మూకశ్మీర్ ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు పూర్తి భిన్నంగా వెలువడ్డాయి. హర్యానాలో ఎన్డీయే, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచాయి. ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్‌ను విజేతగా పేర్కొన్నాయి. తాజాగా తొమ్మిది సర్వేల్లో ఆరు... మహాయుతి గెలుపును అంచనా వేయగా, మూడు సర్వేల్లో ఎవరికీ పూర్తి మెజారిటీ రాదని తేలింది. ఒకటి మాత్రమే ఎంవీయే గెలుస్తుందని పేర్కొంది. శనివారం ఓట్ల లెక్కింపు వేళ బీజేపీ, కాంగ్రెస్, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వర్గాల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. గెలుపుపై ఎవరికి వారు దీమాగా ఉన్నారు. పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారు.

**మహాయుతి వర్సెస్ ఎంవీయే**

మహారాష్ట్రలో ఓటింగ్ శాతం పెరగడంపై మహాయుతి, ఎంవీయే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఓటింగ్ శాతం పెరిగితే తమకు కలిసివస్తుందని బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. అయితే ప్రస్తుత పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తితోనే ఓటింగ్ శాతం పెరిగిందని, ఇది తమ గెలుపును సూచిస్తోందని ఎంవీయే నేతలు చెబుతున్నారు. ఓటింగ్ శాతం పెరిగిన ప్రతిసారీ బీజేపీకి, ఎన్డీయేకి లబ్ధి చేకూరుతుందని, ఈసారీ అదే జరుగుతుందని ఫడ్నవీస్ నమ్మకంగా చెప్పారు. 2019 ఎన్నికల్లో 61.74 శాతం పోలింగ్ జరుగగా ఈసారి 65శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు ఈ ఎగ్జిట్ పోల్స్‌ను మోసపూరితమైనవిగా శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ దుయ్యబట్టారు. ఎంవీయే విజయం తథ్యమ న్నారు. హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికలప్పుడు తప్పుడు అంచనాలు వెలువడటాన్ని గుర్తుచేశారు. బీజేపీ 400 మార్కును దాటుతుందన్న అంచనా తారుమారైందని, ఇండియా ఐక్యసంఘటన సత్తా చాటిందని రౌత్ అన్నారు. ప్రజలు ప్రతిసారీ తమ మనస్సులోని మాట వెల్లడించరంటూ ఎవరికి ఓటు వేసింది ప్రజలు చెప్పరన్న ఉద్దేశంతో సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. 'నాలుగు వేల మందిని సర్వే చేసి వీరు గెలుస్తారు... వారు విజయం సాధిస్తారని అంటారు కానీ ఫలితాలు అందుకు పూర్తి భిన్నంగా వెలువడతాయి. హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందన్నారు కానీ ఏం జరిగింది? మోదీకి లోక్‌సభలో 400 సీట్లు వస్తాయన్నారు... వచ్చాయా? మేము ఇప్పుడు 160-165 స్థానాల్లో గెలుస్తాం... వేచిచూడండి' అని సంజయ్ రౌత్ అన్నారు.

## 'వక్ఫ్' కమిటీకి ఇంకొంత సమయం

### ప్రతిపక్ష సభ్యుల డిమాండ్

**న్యూఢిల్లీ:** వక్ఫ్ సరవణ బిల్లుపై నివేదిక సమర్పించేందుకు ఉమ్మడి కమిటీకి మరికొంత గడువు ఇవ్వాలని ప్రతిపక్ష సభ్యుడు డిమాండ్ చేశారు. ముసాయిదా చట్టంలో మార్పుల అధ్యయనానికి కొంత సమయం అవసరమన్నారు. కమిటీ గురువారం భేటీ కాగా ఇదే చివరి సమావేశమని చైర్మన్ జగదాంబిక పాల్ తెలిపారు. ప్యానల్ ముసాయిదా నివేదిక త్వరలోనే సభ్యులకు అందుతుందన్నారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ వ్యవహారంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జోక్యాన్ని కొందరు కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశలు మొదలైన మొదటి వారంతానికి నివేదిక ఇవ్వాలని కమిటీకి లోక్‌సభ సూచించింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత వక్ఫ్ (సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలకు సంబంధించి వక్ఫ్ బిల్లును కేంద్రం ఇప్పటికే లిస్ట్ చేసింది. కాగా, కమిటీ చైర్మన్ పాల్ (బీజేపీ ఎంపీ) కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు ఇంతకుముందు కూడా ఆరోపణలు చేశారు. నిత్యం సమావేశాలు నిర్వహించడం ద్వారా తమకు సమయం లభించడంలేదని, కార్యకలాపాలను పాల్ బుల్‌డోజ్ చేస్తున్నారని ఆరోపించారు. పాల్ విషయంలో ఓం బిర్లా జోక్యాన్ని అనేక మంది విపక్ష సభ్యులు గతంలోనూ కోరారు.

## ఎఫ్ఎస్‌పీఏ రాష్ట్రవ్యాప్త అమలు

### 10 మంది కుకీ ఎమ్మెల్యేల డిమాండ్

**ఇంఫాల్/గువహటి:** సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ)ను మణిపూర్ అంతటా అమలు చేయాలని పది మంది కుకీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. లూటీ అయిన ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికార బీజేపీ కూటమికి చెందిన ఏడుగురితో సహా ఎమ్మెల్యేలు ఈ మేరకు గురువారం అసెంబ్లీలో డిమాండ్ చేశారు. హింస జరిగిన జిరిబమ్‌తో పాటు ఆరు పోలీసు స్టేషన్ల పరిధి ప్రాంతాల్లో ఏఎఫ్ఎస్‌పీఏను ఈనెల 14న కేంద్రం పునరుద్ధరించింది. స్థానికంగా తెగల పోరు తీవ్ర రూపం దాల్చుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ప్రస్తుతం 13 పోలీసు స్టేషన్‌ల పరిధి ప్రాంతాలు మినహా రాష్ట్రమంతటా ఏఎఫ్ఎస్‌పీఏ అమల్లో ఉంది. మినహాయించిన ప్రాంతాల్లోనూ ఏఎఫ్ఎస్‌పీఏను అమలు చేయాలని 10 మంది ఎమ్మెల్యేలు సంయుక్త ప్రకటన వెలువరించారు. గతేడాది మే 3వ తేదీ నుంచి మైతేయిలు దోచుకున్న ఆరువేలకుపైగా ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఇదొక్కటే మార్గమన్నారు. జిరిబమ్ జిల్లాలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లల హత్యకు బాధ్యులైన కుకీ తీవ్రవాదులపై సామూహిక ఆపరేషన్‌కు పిలుపునిచ్చే తీర్మానాన్ని అధికార పక్ష ఎమ్మెల్యేలు ఆమోదించడాన్ని దుయ్యబట్టారు. ఈ తీర్మానం ఏకపక్షమైనది... విభజించేదిగా ఉన్నదన్నారు. ఆరుగురు పౌరుల హత్య సంబంధిత కేసులను ఎన్ఐఏకు అప్పగించాలన్న తీర్మానాన్ని కూడా విమర్శించారు. 2023, మే 3 నుంచి రాష్ట్రంలో జరిగిన పౌర హత్యలకు సంబంధించిన కేసులన్నింటినీ ఎన్ఐఏకు అప్పగించాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి 15 నుంచి 10,12 తరగతుల పరీక్షలు

**న్యూఢిల్లీ:** సీబీఎస్ఈ 10,12 తరగతుల బోర్డు పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 10,12 తరగతుల బోర్డు పరీక్షల టైమ్‌టేబుల్‌ను సీబీఎస్ఈ తన అధికారిక వెబ్‌సైట్‌లో గురువారం ప్రకటించింది. 10వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న ప్రారంభమై మార్చి 18న ముగుస్తాయి. 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగియనున్నాయి. విద్యార్థులు టైమ్‌టేబుల్ వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించవచ్చు.

## జమ్మూకశ్మీర్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సున్నాకు దిగువగా నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో చలి మరింతగా పెరవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. శ్రీనగర్‌లో గురువారం కనిష్ఠ ఉష్ణోగ్రత -0.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ నెల 23 వరకు కశ్మీర్‌లో వాతావరణం సాధారణంగానే ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. 24న మార్పులు వచ్చే అవకాశం ఉందని, లోయలోని ఎత్తయిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షం లేదా తేలికపాటి మంచు కురిసే అవకాశం ఉంది. కాశ్మీర్‌లోని ఖాజిగుండ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత -2.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, పహల్గామ్‌లో -3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. షోపియాన్‌లో-3.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుల్‌మార్గ్‌లో ఉష్ణోగ్రత 0.0 డిగ్రీల సెల్సియస్, కుప్వారాలో -0.9 డిగ్రీలు, కోకర్నాగ్‌లో 0.7 డిగ్రీలు, బందిపొరలో -2.4 డిగ్రీలు, బారాముల్లా -0.4 డిగ్రీలు, బుద్గామ్ -2.1 డిగ్రీలు, కుల్గామ్ -2.6 డిగ్రీలు, లార్నులో -3.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## మణిపూర్ ప్రజలు మెరుగుదలకు అర్హులు: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** మణిపూర్ ప్రజలు మరింత మెరుగైన పరిపాలనకు అర్హులని, ప్రస్తుతమున్నది పార్ట్‌టైమ్ గవర్నర్... విఫలమైన ముఖ్యమంత్రి... ఘోరంగా విఫలమైన హోంమంత్రి అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. 'మాజీ గవర్నర్ అనుసూయ ఉయికె పదవీ కాలాన్ని 18నెలల కంటే తగ్గించారు. ఎన్నిసార్లు విన్నవించినా ప్రధాని ఎందుకు మణిపూర్‌లో పర్యటించలేదో ఆమెకు కూడా అర్థం కాలేదు. ఈ ఏడాది జులై 31 నుంచి మణిపూర్‌కు పూర్తిస్థాయి గవర్నర్ లేరు. ప్రస్తుతమున్న వారు అసోంలోనే ఎక్కువ ఉంటారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. నెలల తరబడి హింస జరుగుతూ రాష్ట్రం అట్టుడికిపోతుంటే ప్రధాని మోదీ మాత్రం మణిపూర్‌కు రాలేదు. దేశవిదేశాల్లో పర్యటించే ప్రధాని మణిపూర్‌కు ఎందుకు రారంటూ కాంగ్రెస్ పదేపదే ప్రశ్నిస్తోంది.మణిపూర్ విషయంలో మోదీని ఎప్పటికప్పుడు దుయ్యబడుతోంది.

## 11 మందితో ఆప్ తొలి జాబితా విడుదల

**న్యూఢిల్లీ:** దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి, 2025లో జరగనున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ రెండు నెలల ముందు నుంచే ఎన్నికల సంసిద్ధతను మొదలుపెట్టింది. అభ్యర్థుల తొలి జాబితాను గురువారం విడుదల చేసింది. మొదటి జాబితాలో 11 మంది ఉన్నారు. ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఆప్‌లో చేరిన ఆరుగురికి తొలి జాబితాలో చోటు కల్పించారు. పార్టీ అధినేత కేజ్రీవాల్ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలి జాబితాను విడుదల చేశారు. బ్రహ్మ సింగ్ తన్వార్, అనిల్ జా, బీబీ త్యాగి బీజేపీ నుంచి, జుబైర్ చౌదరీ, వీర్ సింగ్ దింగన్, సోమేశ్ షోకీన్‌లు కాంగ్రెస్ నుంచి ఆప్‌లోకి వచ్చారు. కేజ్రీవాల్ ప్రకటించిన జాబితాలో సరితా సింగ్, రామ్ సింగ్ నేతాజీ, గౌరవ్ శర్మ, మనోజ్ త్యాగీ, దీపక్ సింఘాల్ ఉన్నారు. దిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 70 స్థానాల్లో 62 స్థానాలను కైవసం చేసుకుంది.

## ఒమర్ అబ్దుల్లా నిరాడంబరత

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన కోసం వేదికపై ప్రత్యేకంగా పెద్ద కుర్చీ ఏర్పాటు చేశారు. అయితే ఆ కుర్చీలో కూర్చునేందుకు ఒమర్ అబ్దుల్లా నిరాకరించారు. వేదికపై ఆశీనులైన వారికి కేటాయించిన మాదిరి కుర్చీలోనే ఆయన కూర్చున్నారు. జమ్ములోని చాతాలో షేర్-ఇ-కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రధాన క్యాంపస్‌ను ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. నాలుగు రోజులు జరిగే 'నేషనల్ అగ్రికల్చర్ సమ్మిట్, కిసాన్ మేళా'ను ఆయన ప్రారంభించారు. కాగా, ఆ కార్యక్రమం వేదికపైకి ఎక్కగానే అక్కడ ఒమర్ అబ్దుల్లా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెద్ద కుర్చీని ఆయన గమనించారు. దీంతో ఆ పెద్ద కుర్చీ తీసివేయాలని నిర్వాహకులను కోరారు. వేదికపై ఆశీనులైన వారు కూర్చొన్న కుర్చీలాంటిది ఏర్పాటు చేయాలని చెప్పారు. నిర్వాహకులు అలాంటి కుర్చీ ఏర్పాటు చేయడంతో దానిపై కూర్చొన్నారు. దీంతో సీఎం ఒమర్ అబ్దుల్లా తీరును సభికులు చప్పట్లతో అభినందించారు. అక్టోబరు 16న జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా పదవీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి వీఐపీ ఆడంబరాలకు ఆయన దూరంగా ఉన్నారు. తన కాన్వాయ్ ప్రయాణం కోసం 'గ్రీన్ కారిడార్' ఏర్పాటు చేయవద్దని, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని పోలీసులకు సూచించారు.

# నెత్తురోడిన రహదారులు

### 12 మంది దుర్మరణం

**హజారీబాగ్/లక్నో:** జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 12 మంది దుర్మరణం చెందారు. 25 మందికి పైగా గాయపడ్డారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పాట్నా వెళుతున్న బస్సు హజారీబాగ్ జిల్లాలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులు మృతిచెందారు. కొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం ఈ బస్సు కోల్‌కతా నుంచి పాట్నా వెళు తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. బర్కతాలోని గోర్హర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నారు. కాగా, యూపీలో అర్ధరాత్రి యమునా ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డు నెత్తురోడింది.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఓ వోల్వో బస్సు... ట్రక్కును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదురుగు మరణించారు. 15 మందికి గాయాలు కాగా... కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దిల్లీ నుంచి ఆజంఘడ్ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు తప్పల్ వద్ద ఎదురుగా వస్తున్న ఖాళీ బీర్ల సీసాల ట్రక్కును ఢీ కొట్టింది. ఘటనలో ఐదుగురు చనిపోగా... ఇందులో ఓ పసికందు, మహిళ, ముగ్గురు పురుషులు ఉన్నారు. మరో 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి బస్సు ముందు భాగం తుక్కుతుక్కు అయింది. అందులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని అతికష్టం మీద బయటకు తీశారు. క్షతగాత్రుల్ని జెవార్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జార్ఖండ్, మహారాష్ట్రలో గెలుస్తాం: కాంగ్రెస్

**లక్నో:** మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో కచ్చితంగా గెలిచి తీరుతామని కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 400 స్థానాలను కాంగ్రెస్‌నే గెలుస్తుందని, అధికారం చేపడుతుందని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. అయితే ఇలాంటి గద్దర్ల వల్ల ప్రజలకు ఎలాంటి అభిప్రాయం ఉన్నా... మాకు మాత్రం మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నమ్ముతున్నాం. ఆ రాష్ట్రంలో మహిళలు, రైతులు, యువకులు మహాయతి కూటమి తిరిగి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదు. జార్ఖండ్‌లో తిరిగి అధికారంలోకి వస్తాం. మహారాష్ట్రలో మార్పుకు కృషి చేశాం. ఆ విధమైన మార్పు తీసుకొస్తామని విశ్వసిస్తున్నాం' అని ఆయన అన్నారు.

## మేము కలిసి ఉండలేం

### ధనుష్ దంపతులు

**చెన్నై:** విడాకుల కేసు విచారణలో భాగంగా నటుడు ధనుష్, ఆయన సతీమణి ఐశ్వర్య తాజాగా చెన్నై ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టు ఎదుట హాజరయ్యారు. తాము కలిసి ఉండాలనుకోవడం లేదని, విడిపోవాలని నిర్ణయించుకున్నామని న్యాయస్థానానికి తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను వారు వివరించారు. ఇద్దరి వాదనలు విన్న కోర్టు తుది తీర్పును ఈనెల 27కు వాయిదా వేసింది. సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఐశ్వర్య పెద్ద కుమార్తె. చదువుకునే రోజుల్లో ధనుష్ అక్క, ఐశ్వర్యకు మంచి స్నేహితురాలు. అలా, వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. కొంతకాలానికి అది ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో 2004 నవంబర్ 18న వారి వివాహం జరిగింది. 18 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ తాము విడిపోవాలనుకుంటున్నామని దాదాపు రెండేళ్ల క్రితం ధనుష్ - ఐశ్వర్య ప్రకటించారు. పరస్పర అంగీకారంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. '18 ఏళ్లపాటు స్నేహితులుగా, భార్యాభర్తలుగా, తల్లిదండ్రులుగా, శ్రేయోభిలాషులుగా అర్థం చేసుకొని మా ప్రయాణం కొనసాగించాం. ఇప్పుడు మేము వేర్వేరు దారుల్లో ప్రయాణించేందుకు సిద్ధమయ్యాం. ఐశ్వర్య, నేనూ విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం' అని 2022లో ధనుష్ పోస్ట్ పెట్టారు. విడాకుల కోసం ఈ ఏడాది ఆరంభంలో చెన్నైలోని ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే చాలామార్లు ఈ కేసు విచారణకు రాగా... వీరిద్దరూ హాజరుకాలేదు. దీంతో వీరిద్దరూ తిరిగి కలుస్తారని అందరూ భావించారు. తాజా విచారణతో ఈ జంట విడిపోవడానికే నిర్ణయించుకున్నట్లు స్పష్టమైంది.

# విశాలాంధ్ర హైదరాబాద్

## అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే కేపీ

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** ఇంటి అనుమతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు.గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం సర్కిల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ గాజులరామారం డివిజన్ పరిధిలో ఇంటి నిర్మాణాల అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నియమ, నిబంధనలను పాటించకుండా వక్ఫ్, దేవాదాయ శాఖలపేరు చెప్పి అనుమతులు ఇవ్వకుండా దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, కోర్టు ఉత్తర్వులను పాటించకుండా చేద్దాంలే చూద్దాం లే అనే ధోరణి వహించకుండా దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయకుండా వెంటనే అనుమతులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, ఏసిపి రమేష్, టిపిఎస్ తుల్జా సింగ్, హెచ్ఐఎల్ కాలనీవాసులు అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, అంజయ్య, వీరయ్య చౌదరి, తాహేద్, శ్రీనివాస్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు వరం

**విశాలాంధ్ర -కాప్రా :** సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్లుగా తెలిపారు. ఉప్పల్ సర్కిల్లోని ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్ ప్రాంతాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం రజిత పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు రూ.60 వేలు, రామచందర్ 32,500, అమృత60, వేలు భాగ్యలక్ష్మి60, వేలు ఈఫ్తికార్ హుస్సేన్ 60, వేలు మీరాదేవి గుప్త 31500 చొప్పున మంజూరైన చెక్కులను రజిత పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి ,తుమ్మల దేవి రెడ్డి ,ఆగం రెడ్డి ,మంచాల రఘు, అసలాం, మాశెట్టి రాఘవేందర్, పూజారి హనుమంత్, ఆనంద్ ప్రభు మంద సుమన్‌రెడ్డి, బజారు నవీన్ గౌడ్, రంగుల శేఖర్ పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్య : ఎంపీ

**విశాలాంధ్ర - ఆమనగల్లు :** రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. గురువారం ఉదయం జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మతల్లిని ఎంపీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆలయ సంప్రదాయం ప్రకారం ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని అమ్మవారికి ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ పంతునాయక్ వినతి మేరకు మైసిగండి మైసమ్మ దేవస్థానం శివాలయం రామాలయం దేవస్థానాలు అభివృద్ధి చేశామన్నారు. రాబోవు రోజుల్లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో సంభాషణ చేసి శ్రీశైలం - తిరుపతి రోడ్‌కు ఉన్న ఈ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. దేవస్థానం అభివృద్ధి కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరి చేయాలని ఫౌండర్ ట్రస్టీ శిరోలి, దేవస్థానం సిబ్బంది వినతి పత్రం అందజేయగా ఎంపీ సానుకూలంగా స్పందించి, నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ సభ్యులు మధుసూదన్ రెడ్డి,డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యాదర్శి నేనావత్ బిక్య నాయక్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

**విశాలాంధ్ర- మల్కాజిగిరి :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరా నెహ్రూ నగర్ కాలనీలలో సుమారు 66 గల్లీలకు సుమారు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన మెట్ల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఆధునికీకరణ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్‌లోనే అతిపెద్ద మురికివాడైన ఇందిరా నెహ్రూ నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ స్థానిక మహిళ నాయకులు కార్యకర్తలు బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖాముఖికి వినతుల వెల్లువ

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్నికి శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి వినతులు వెలువత్తాయి. సుమారు 300 మంది వివిధ సమస్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. మొదట బృందాలుగా వచ్చిన వారితో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించిన ఇంకా పోస్టింగులు ఇవ్వలేదంటూ జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు డిప్యూటీ సీఎం కలిశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ సీఎం వారికి హామీ ఇచ్చారు. ట్రాన్స్కో, జెన్కోలో ఖాళీగా ఉన్న డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల, ఇంజనీర్ల ఖాళీలను భర్తీ చేయాలని సంబంధిత శాఖ ఉద్యోగులు కోరారు. పలు సమస్యలపై ఐదు బృందాలు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేయగా సమ్మతి

అధికారులను వివరణ కోరుతూ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. తదుపరి సాధారణ పౌరులు, కార్యకర్తల సమస్యలు విని సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు, నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతలు తమ విజ్ఞప్తులు సమర్పించారు. తన తల్లి మాదుగు కళ్యాణి (42) బ్రెస్ట్ క్యాన్సర్ తో బాధపడుతుందని, క్యాన్సర్ ఫోర్త్ స్టేజిలో ఉంది హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె కుమారుడు మహేష్ విజ్ఞప్తి చేశారు. వెను వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం ఆసుపత్రి బిల్లులు తీసుకువచ్చి.. ఆ మొత్తానికి ఎల్‌ఓసి తన వద్ద తీసుకోవాల్సిందిగా తెలిపారు. జూ పార్కులో డైట్ బిల్స్ పెండింగ్లో ఉన్నాయని సిబ్బంది కోరగా ... వెంటనే మంజూరు చేయాలంటూ అధిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినతుల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కార్యాలయానికి సంబంధించి 28 దరఖాస్తులు రాగా, సీఎం ఓ కార్యాలయం కి సంబంధించి 199, రెవెన్యూ శాఖకు సంబంధించి 41, సివిల్ సప్లై శాఖ 9, రవాణా శాఖ, బీసీ వెల్ఫేర్ కి సంబంధించి 4, పర్యాటక శాఖకు సంబంధించి 2, దేవాలయ, అటవీశాఖకు సంబంధించిన 8, పిసిసి కార్యాలయం సంబంధించి 19, జిహెచ్ఎంసి 6, వ్యవసాయ శాఖకు సంబంధించిన 8 దరఖాస్తులు వచ్చాయి.

## ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబేద్కర్ గ్రౌండ్ వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్‌ను ప్రారంభించారు. గౌరవ అతిథులుగా ఆల్ ఇండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ జాతీయ చైర్మన్ అర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ పీసీసీ హన్మంతరావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నాగరికరీ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. తెలంగాణలోని పలువురు మత్స్యకారులకు ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాలను అందజేశారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

- సిద్ధమవుతున్న 22 మహిళా శక్తి భవనాలు
- శిల్పారామంలో 106 స్టాళ్ళతో ఇందిరా మహిళా శక్తి బజార్
- తొలివిడతలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు
- మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలచే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటు, శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుపై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణం పనులు మొదులుపెట్టి, 8 మాసాలలో పూర్తి చేయాలనీ ఆదేశించారు.రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు 106 షాప్‌లతో ఏర్పాటు చేస్తున్న ఈ బాజార్ నిర్మాణ

పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, డిసెంబర్ మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ ఇందిరా మహిళా శక్తి బజార్లో నిత్యం వివిధ సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలు చేయటానకి మహిళలకు ఆర్థిక చేయూతకై నగరంలోని ఐ.టి సంస్థలు, ఇతర ప్రముఖ వాణిజ్య, వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో అద్భుతంగా పొదుపు సంఘాలను నిర్వహిస్తూ, అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాలచే బస్సులను కొనుగోలు చేయించి వాటిని టీ.ఎస్.ఆర్.టీ.సి ద్వారా నిర్వహించేందుకు తగు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని, దీనిలో భాగంగా మొదటి దశలో 150 బస్సుల కొనుగోలును వెంటనే చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. వీటితో పాటు, మహిళా సంఘాల ద్వారా 4000 మేఘావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి దశలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. ఈ ప్లాంట్లను నీటిపారుదల శాఖ, దేవాదాయ, ఆటవీ శాఖలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలను కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు అనంతరం వీటి నిర్వహణా భాధ్యతలను తెలంగాణ రెడ్కో, విద్యుత్ డిస్కం లు చేపడుతాయని స్పష్టం చేశారు. రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పీసీసీఎఫ్ ఆర్.యం.డోబ్రియల్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎండోమెంట్స్ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**విశాలాంధ్ర,హైదరాబాద్:** జలమండలి ఎస్టీపీల్లో పనిచేసే కార్మికులకు అంబర్ పేట్ ఎస్టీపీ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శ్రీ రామానుజ సేవా ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్టుల్ని ఆయన అభినందించారు. దాదాపు 300 మంది కార్మికులకు ఈ ఆరోగ్య శిబిరంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ, ఈడీలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామానుజ సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జీవీ.ధనుంజయ్, జీఎంలు సుబ్రమణ్యం, సంతోష్ కుమార్, డీజీఎంలు రాజ్ కుమార్, నాగేశ్వర రావు, వినోద్ కుమార్, మేనేజర్ లు కల్యాణి, భాను చందర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మీడియా సంస్థల్లో వృత్తి పరంగా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మహిళా సంక్షేమ కమిటీ విజ్ఞప్తి చేసింది. గురువారం బీఆర్.కె భవన్ లో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కలుసుకున్న ప్రతినిధి బృందం, మహిళా జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తెస్తూ, వినతి పత్రాన్ని అందించింది. ప్రతి మీడియా సంస్థలో మహిళలకు 33 శాతం అక్రెడిటేషన్లు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ అనేక మీడియా సంస్థలు దానిని అమలు చేయడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా జర్నలిస్టులకు తమ వాటా ప్రకారం అక్రెడిటేషన్లు ఇచ్చే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని వారు కోరారు. ప్రతి మీడియా సంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది కూడా అమలు కావడం లేదని వారు విచారం వ్యక్తం చేశారు. విశాఖ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి మీడియా సంస్థలోనూ జెండర్ సెన్సిటివిటీ వర్క్‌షాప్స్ జరగాలనే నిబంధన కాగితాలకే పరిమితమైందన్నారు. ఇప్పటినుంచైనా విశాఖ గైడ్‌లైన్స్ ప్రతిచోటా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఐసీసీ గైడ్‌లైన్స్ పాటించని సంస్థలకు అక్రెడిటేషన్లు ఇవ్వరాదనే నిబంధనను తీసుకురావాలన్నారు. తమ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల జాబితాను ప్రతి మీడియా సంస్థ కచ్చితంగా ఆరు నెలలకోసారి మీడియా అకాడమీకి సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్

కచ్చితంగా అమలు చేయాలని, అక్రెడిటేషన్‌లతో సంబంధం లేకుండా మహిళా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరీ చేయాలన్నారు. ఆయా మీడియా సంస్థలు పూర్తి స్థాయి మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపును ఆరు నెలలకోసారి నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. మీడియా సంస్థల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు రాత్రివేళల్లో తప్పనిసరిగా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ఇబ్బందులు, మహిళా జర్నలిస్టుల భద్రత, ఇతర సమస్యల పరిష్కారానికి మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. పైఅంశాలపై ప్రభుత్వంతో చర్చించి, విధివిధానాలను రూపొందించి, మహిళా జర్నలిస్టుల సంక్షేమానికి భరోసా కల్పించాలని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని వారు విజ్ఞప్తి చేశారు. మహిళా జర్నలిస్టుల సమస్యలపై చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే మహిళా సంక్షేమ కమిటీ బాధ్యులు కళ్యాణం రాజేశ్వరీ, అత్తలూరి అరుణ, అజితా, వంగ యశోద, సూర్యకుమారి, ప్రతిభ, సాజిదా బేగంలు పాల్గొన్నారు.

## దైవసాక్షిగా తప్పుడు మాటలా ? : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** కురుమూర్తి స్వామి దర్శనం కోసం వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు అదే దైవసాక్షిగా తప్పుడు మాటలు మాట్లాడారని దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి దేవస్థాన అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే ఆర్అండ్‌బి మంత్రితో మాట్లాడి వెనువెంటనే ఆలయానికి ఘాట్‌రోడ్ మంజూరు చేయడంతో పాటు స్వామివారి దర్శనా నికి విచ్చేసి, దేవస్థాన అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ని ఆదేశించారన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు ఆధునిక దేవాలయాలైన ప్రాజెక్టులను, పెండింగ్ ప్రాజెక్టుల పనులను సైతం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పాల మూరు జిల్లాలో జూరాల, కోయిల్ సాగర్, బీమా 1, బీమా 2, సరళ సాగర్, నెట్టెం పాడ్, శంకర సముద్రం, కెఎల్ఐ ప్రాజెక్టలను కాంగ్రెస్ హయాంలో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. శంకర సముద్రం, కెఎల్ఐ, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల పెండింగ్ పనులను పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు కురుమూర్తి స్వామిని పట్టించుకోని వారు, అధికారం కోల్పోయిన వెంటనే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కురుమూర్తి విచ్చేసిన తర్వాతనే బీఆర్ఎస్ నాయకులకు కురుమూర్తి స్వామి గుర్తుకు వచ్చారా అంటూ నిలదీశారు. పాలమూరు జిల్లాలో సాగుతున్న ఆయకట్టంతా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే - గత పదేళ్లలో బిఆర్ఎస్ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేదని ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును నీ మామ మూడు సంవత్సరాలలో పూర్తి చేస్తానని, పూర్తి చేయలేదు - కానీ పాలమూరు ప్రాజెక్టు చేపట్టిన సంవత్సరం తర్వాత చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ సంవత్సరం లోనే పనులు పూర్తిచేసిన మీరు పాలమూరు రంగారెడ్డిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు కేసులు వేశారంటున్న హరీష్ రావుకు కేసులు వేసిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి పక్కన పెట్టుకొని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.

## పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** బహద్దూర్ పూరలోని దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పాఠశాల ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం బహద్దూర్ పూరలోని దారుల్ షిఫా ప్రభుత్వ ఉన్నత ఉర్దూ మీడియం, ప్రభుత్వ బాలుర అంధుల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఉర్దూ మీడియం పాఠశాలలో డ్రైనేజీ నీటి ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఇఓ,డిప్యూటీ ఈఓ, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్, ఈఈ ఐడిసి, హెచ్ఎండబ్ల్యూఎస్, తహసీల్దార్, పాఠశాల హెడ్మాస్టర్‌లు పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలు చేపట్ట వలసిన పనులను శుక్రవారం సాయంత్రం లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల అసంపూర్తి పనులు పూర్తిచేయాలని దానికి కావలసిన నిధుల గురించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. అనంతరం అంధుల పాఠశాల సందర్శించి పాఠశాలలో పిల్లలతో మాట్లాడారు. సరిగా భోజనం ఇస్తున్నారా, బుక్స్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో డ్రైనేజీ వాటర్ పాఠశాలలో రాకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని జిహెచ్ ఎంసి డిప్యూటీ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈఓ ఆర్. రోహిణి, హెచ్ఎమ్డబ్ల్యూఎస్ మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జకీ, హెడ్మాస్టర్ మహమ్మద్ మసూద్దీన్ అహ్మద్, తహసీల్దార్ చంద్రశేఖర్, మహమ్మద్ సాదిక్ పాషా పాల్గొన్నారు.

## నాల విస్తరణ పనులు పరిశీలన

**విశాలాంధ్ర-శేరిలింగంపల్లి:** మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు నుంచి పటేల్ చెరువు వరకు చేపట్టబోయే నాల విస్తరణ నిర్మాణ పనులను గౌరవ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ అరెకపూడిగాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు నాల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుంది అని, ప్రతి వర్షానికి వరద నీరు చుట్టుపక్కల కాలనీలు ముంచెత్తడం జరుగుతుంది అని, సమస్య శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపట్టడం జరుగుతుంది అని, భవిష్యత్తు లో వరద సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొని నాల విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ నాల విస్తరణ నిర్మాణము పనుల వలన చుట్టుపక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో ఉపశమనం కలుగుతుందని, ప్రజలకు సాంత్వన చేకూరుతుందని, ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరునని, రాబోయే వర్షాకాలం లోపు పనులు పూర్తిచేయాలని తెలిపారు. అభివృద్ధి,సంక్షేమం ఆగకూడదనే ఉదేశ్యం తో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని,అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా నాల విస్తరణ పనులు చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తి అయ్యేలా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఈ ఆనంద్ , ఏఈ జగదీష్ , కాంట్రాక్టర్ పీఎస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిపై అత్యంత విలువైన సహజ వనరు నీరు : మంత్రి

**విశాలాంధ్ర-శేరిలింగంపల్లి:** కొత్త కరెన్సీ నీరు అనే థీమ్‌తో మూడు రోజుల పాటు జరిగే 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ నగరంలోని హైటెక్స్‌లో గురువారం ప్రారంభమైంది. నీరు

భూమిపై అత్యంత విలువైన సహజ వనరులలో ఒకటి, ఇది అన్ని రకాల జీవులకు అవసరం. అయినప్పటికీ అది మనం రక్షించుకోవాల్సిన పరిమిత వనరు. దురదృష్టవశాత్తు, నీరు దాని ప్రాముఖ్యత ఎల్లప్పుడూ గుర్తించ బడడంలేదు . నీటి వ్యవస్థలను వ్యవస్థాపించడం, నిర్వహించడంలో ప్లంబింగ్ పరిశ్రమ చేస్తున్న కృషి ఈ అమూల్యమైన వనరులను సంరక్షించడంలో సహాయపడుతుందని, భవిష్యత్ తరాలు పరిశుభ్రమైన, సురక్షితమైన నీటి ప్రయోజనాలను పొందగలవని నిర్ధారిస్తుందని మంత్రి డి. శ్రీధర్ బాబు తన వీడియో సందేశంలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన వీడియో ప్లే చేయబడింది. 'పైప్‌లు వేయడమే కాకుండా వాటిని అమర్చడానికి మాత్రమే కాకుండా ప్రజారోగ్యం, పర్యావరణ సుస్థిరతకు ప్లంబింగ్ నిపుణులు నిజమైన సంరక్షకులుగా ఉంటున్నారు. మీ పని ద్వారా, మీరు ఆరోగ్యకరమైన, కనెక్ట్ చేయబడిన ప్రపంచాన్ని సృష్టించేందుకు సహకరిస్తున్నారు. నీటి సంరక్షణను ప్రోత్సహించడం, ప్రతి చుక్కను లెక్కించడం, భవిష్యత్తు కోసం నీటిని ఆదా చేయడం యొక్క ముఖ్యమైన ప్రాముఖ్యత గురించి సమాజాలకు అవగాహన కల్పించడం కొనసాగించాలని నేను మీ అందరినీ కోరుతున్నాను' అని మంత్రి తెలిపారు.నీటికి విలువనిచ్చే, సంరక్షించబడే మరియు అందరూ పంచుకునే భవిష్యత్తును మనం నిర్మించుకోవచ్చు. ప్రకృతి ప్రసాదించిన ఈ అమూల్యమైన కానుకను కాపాడుకోవడంలో సమిష్టి బాధ్యత వహించాలని మంత్రి పిలుపునిచ్చారు .తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ మరియు పబ్లిక్ రిలేషన్స్) శ్రీ హర్కర వేణుగోపాలరావు, ముఖ్య అతిథిగా విచ్చేశారు. మిస్టర్ సోరెన్ నొరెలుండ్ కన్నిక్-మార్క్వార్డ్‌సెన్ కమర్షియల్ కౌన్సెలర్, ట్రేడ్ కౌన్సిల్ న్యూ ఢిల్లీ హెడ్ - రీజినల్ కోఆర్డినేటర్‌తో కలిసి సదస్సును ప్రారంభించారు .

## అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా : ఎమ్మెల్సీ కవిత

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు నుంచి విడుదల అయ్యాక తొలిసారి కవిత రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఎన్ని సార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా..? అని కవిత ప్రశ్నించారు. అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా అని ప్రశ్నించారు కవిత. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు. ఎన్ని సార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని ఆమె సూటిగా ప్రశ్నించారు.

## మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

**విశాలాంధ్ర-శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, సోఫా కాలనీ చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ నాయకులు, కాలనీ వాసులు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో ఎన్నాళ్లుగానో ఉన్న డ్రైనేజీకి అవుట్ లెట్ సమస్య చర్యలు తీసుకోవాలని మరియు అసంపూర్తిగా మిగిలిపోయిన సి సి రోడ్లు,యూజీడీ పైప్ లైన్ నిర్మాణము పనులను పూర్తి చేయాలని,మంచి నీటి వసతిని ,మెరుగుపరచాలని విద్యుత్ సమస్యలను మరియు విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని,పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరగా.. కార్పొరేటర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు.కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీకి అవుట్ లెట్‌ను ఏర్పాటుచేసి, అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్ధంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు నాయక్,శ్రీనివాస్, నరసింహ స్వామి, బాలకృష్ణ, వేంకటేశ్వర రెడ్డి, నారాయణ, కృష్ణ,లాల్ సింగ్,విజయ్,హీర్య,మోహన్ బాబు, వెంకటేష్ నాయక్, రాజు, సురేష్,గోపాల కృష్ణ, సత్యనారాయణ రాజు, కళ్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

## పైసాబజార్ 'క్రెడిట్ కార్డ్ రివార్డ్ కాలిక్యులేటర్' ప్రారంభం

**విశాలాంధ్ర, జూబిలీహిల్స్ :** వినియోగదారులు వివిధ లావాదేవీల్లో సరైన క్రెడిట్ కార్డును ఎంచుకునేందుకు వీలుగా 'క్రెడిట్ కార్డ్ రివార్డ్ క్యాలిక్యులేటర్'ను ప్రారంభించామని పైసాబజార్ క్రెడిట్ కార్డ్స్ హెడ్ రోహిత్ చిబ్బర్ తెలిపారు. ఈ క్యాలిక్యులేటర్ జర్నీ, షాపింగ్, డైనింగ్, కిరాణా, ఇంధనం మొదలైన వాటితో సహా వివిధ సందర్భాలలో ఖర్చు చేసినప్పుడు సంపాదించగల రివార్డ్‌లపై స్పష్టమైన వీక్షణతో కాలిక్యులేటర్ ఉండనుందన్నారు. ఇది వివరాలు తెలుసుకోవడానికి, పోల్చుకోవడానికి, గరిష్ట రివార్డును పొందడానికి అవసరమైన సమగ్ర సమాచారాన్ని సెకండ్లలో అందిస్తుందన్నారు. రివార్డ్ క్యాలిక్యులేటర్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. క్రెడిట్ కార్డ్ వినియోగదారులలో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న పెద్ద సవాలును పరిష్కరించనున్నామని తెలిపారు. ఇది నెలవారీ లేదా వార్షిక రివార్డ్ సంపాదన, అత్యధిక రివార్డులను అందించే బ్రాండ్‌లు, ఖర్చుల కోసం రివార్డ్ పాయింట్‌ల వివరణాత్మక బ్రేక్‌డౌన్‌ను అందిస్తుందని తెలిపారు. ప్రతి కార్డు సమగ్ర సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేయడం ద్వారా.. ప్రతి వినియోగదారుడు ప్రత్యేక వ్యయ విధానాలకు అనుగుణంగా స్మార్ట్ ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

## రోడ్డు విస్తరణ బాధితులపై రెవెన్యూ అధికారుల దౌర్జన్యం?

**విశాలాంధ్ర-జవహర్ నగర్ :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం చెన్నాపురం చౌరస్తాలో రోడ్డు విస్తరణ భూ బాధితులు రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మీడియా ఎదుట తమ గోడును వెళ్ళబోసుకున్నారు. మేము గత 20 సంవత్సరాలుగా ఊర్లో ఉన్న భూములను అమ్ముకొని పైసా పైసా పోగు చేసి 100 గజాలలో ఇల్లు నిర్మించుకుంటే స్వచ్ఛందంగా మేము ముందుకు వచ్చి రోడ్డు విస్తరణకు సహకరించి 50 గజాలు కోల్పోయి మరో 50 గజాలలో ఇల్లు పునర్నిర్మాణం చేసుకుంటే ఇండ్లు దుకాణాలు చిన్న చిన్న వ్యాపారాలు కోల్పోయి రోడ్డున పడ్డ మాకు ప్రభుత్వం తరుపున ఎలాంటి నష్టపరిహారం ప్రత్యామ్నాయం చూపకుండా మాపై రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా తమ ఇండ్లను కూలుస్తున్నారని రెవెన్యూ అధికారుల తీరుపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా కరెంట్, నల్ల బిల్లు ఇంటి పన్ను కట్టుకొని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల బతుకులు దుర్భరంగా మారినయని ఇది పేదల ప్రభుత్వం కాదు బుల్డోజర్ల ప్రభుత్వమని అభివృద్ధి పేరుతో పేదల బతుకులు రోడ్డుపాలవుతున్నాయని బాధితులు రెవిన్యూ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా బాధితుల పక్షాన బిఆర్ఎస్ నాయకులు బండ కింది ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ జవహర్ నగర్‌లో అత్యధికంగా పేద ప్రజలు నివాసం ఉంటున్నారని ఇలాంటి ఏరియాలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇండ్లను తామే తొలగించుకుని మిగిలిన స్థలంలో ఇండ్లు పునర్నిర్మాణం చేసుకుంటుంటే దౌర్జన్యంగా రెవిన్యూ అధికారులు ఎలాంటి సమాచారం నోటీసులు ఇవ్వకుండా బాధితుల ఇండ్ల మీదికి జెసిపిలు తీసుకువచ్చి దుర్మార్గంగా పూర్తిగా పునర్నిర్మాణం చేసుకున్న ఇండ్లను కూల్చి వేయడంతో జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రభుత్వ రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం యంత్రాంగం సహకరించాలని పూర్తిగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ప్రత్యామ్నాయం చూపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోగులకు నాణ్యమైన భోజనం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న బీజనంలో ఎలాంటి లోపం లేదని వారికి నాణ్యమైన భోజనాలు అందిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. మాగనూరు నుండి చికిత్స నిమిత్తం వచ్చిన విద్యార్థులకు అందించిన భోజనంలో పురుగులు ఉన్నాయనే వార్తలు గురువారం ఉదయం నుండి సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికార బృందం స్పందించి ఆసుపత్రికి చేరుకుని అక్కడి పరిస్థితి పై ఆరా తీశారు. బయట జరుగుతున్న విషయంపై అక్కడి రోగులతో ఆరాతీశారు. అయితే విద్యార్థులకు అందించిన బోజనంలో ఎలాంటి కల్తీ లేదా నాణ్యత విషయంలో ఎక్కడ పొరపాటు జరగలేదన్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న అదనపు కలెక్టర్ తో పాటు ఆర్డీవో అనిల్, మహబూబ్ నగర్ తహసీల్దార్ ఘన్సిరాం, మున్సి కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్ కుమార్ సింగ్, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ జరీనా, డిటీషియన్ రమేష్, ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బెజగం రాఘవేందర్, తదితరులు అక్కడే రోగులతో కలిసి వారికి అందించే భోజనంను తిన్నారు. ఉదయం విషయం బయటకు రాగానే మాజి మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజి ఎమ్మెల్యే చిటెం రామ్మోహన్ రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకుని అక్కడి రోగులను కలిసి ఆసుపత్రి సిబ్బందిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కావాలనే కొందరు సోషల్ మీడియాలో తపుడు ప్రచారాలను చేశారని తెలిపారు. ఇక్కడ రోగులకు అందించే భోజనాల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు చెప్పారు. ఇలాంటి తపుడు వార్తలు ప్రచారం చేసి రోగుల ఆత్మస్థైర్యం దెబ్బతియొద్దని సూచించారు.

# నగర సుందరీకరణకు ప్రభుత్వం పెద్దపీట

**విశాలాంధ్ర-హైదరాబాద్ :** నగర సుందరీకరణలో భాగంగా జంక్షన్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, వివిధ రకాల సుందరీకరణ పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన పచ్చదనంలో అంతర్జాతీయ గ్రీన్ సిటీగా అవార్డును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరంలో ప్రజలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించేందుకు వినూత్న పద్ధతిలో పచ్చదనం పెంపొందించడంలో గ్రేటర్ హైదరాబాద్‌లో ఫారెస్ట్ విస్తీర్ణం పెరిగినట్లుగా జాతీయంగా గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సుందరీకరణ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో 6 జోన్‌లకు మొత్తం రూ.149 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంలో జిహెచ్ఎంసి కార్యరూపం దాల్చింది. ఇంతకు ముందు గ్రేటర్‌లో పాదాచారులకు ప్రయోజనాలు కల్పించి ప్రమాద రహితంగా జంక్షన్ లను అభివృద్ధి చేశారు.. ఈ జంక్షన్‌లలో పాదాచారుల భద్రతతో పాటుగా సుందరీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. అందులో కొన్ని సి.ఎస్.ఆర్ పద్ధతిలో చేపట్టుటకు ముందుకు రావడం జరిగింది. ఈ జంక్షన్ అభివృద్ధిలో పాదచారులకు ఎక్కువగా ట్రాఫిక్ ఉన్న సందర్భంలో రోడ్డు దాటకుండా ఉండేందుకు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేసారు. ట్రాఫిక్ లేని సమయంలో పాదాచారులు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా రోడ్డు దాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లై ఓవర్ల వద్ద కళాత్మక చిత్రలేఖనాలు, ముఖ్యంగా భావి తరాలను ప్రభావితం చేసే విధంగా కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఫ్లై ఓవర్ పిల్లర్స్ కొన్ని చోట్ల ఉద్యానవన పెయింట్స్ వెరైటీ థీమ్స్‌తో కళాత్మక చిత్రాలు వేశారు. సెంట్రల్ మీడియం, జంక్షన్‌లలో శిల్పాలు, ఆకర్షించే ప్రత్యేక థీమ్‌లతో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేయుటకు జిహెచ్ఎంసి ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ఆరు జోన్ల పరిధిలో రూ.149.84 కోట్ల అంచనా వ్యయంతో 224 సుందరీకరణ పనులు చేపట్టగా అందులో రూ. 5.33 కోట్ల విలువ గల 15 పనులు పూర్తి కాగా మిగతా 209 పనులు వివిధ ప్రగతి దశలో కలవు. చిన్నారులకు, యువతకు స్ఫూర్తినిచ్చే లా సుందరీకరణ పనులు చేపట్టినట్లు పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనులు పరిశీలన

**విశాలాంధ్ర-హైదరాబాద్:** జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మెహిదీపట్నం, లంగర్ హౌజ్ ప్రాంతాల్లో డీసిల్టింగ్ పనులను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదటగా మెహిదీపట్నం అంబా థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై తరచూ పొంగుతున్న మ్యాన్ హోళ్లను పరిశీలించారు. చుట్టు పక్కల ప్రాంతాల్లోని హోటళ్ల యాజమానులు తమ సీవరేజ్ పైపులైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హోళ్లలో చేరి పొంగినట్లు గమనించారు. దీంతో హోటళ్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేయాలని అధికారులను ఎండీ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారి సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని ఎండీ పునరుద్ఘాటించారు. తద్వారా వాటిలో నుంచి వచ్చే వ్యర్థాలు మ్యాన్ హోళ్లలో కలవకుండా చేయవచ్చన్నారు. ఫలితంగా సీవరేజ్ పైపు లైన్లపై ఒత్తిడి తగ్గి మురుగు ప్రవాహం సాఫీగా ఉంటుందని తెలిపారు. తర్వాత టోలీచౌకిలో జరుగుతున్న డీ-సిల్టింగ్ పనుల్ని పరిశీలించారు. అక్కడ సీవరేజ్ ఔట్ లెట్ లేని లైన్లను జలమండలి నూతనంగా నిర్మిస్తున్న జోన్-3 సీవరేజ్ నెట్ వర్క్ కు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నిర్మాణం దశలో ఉన్న ఈ ప్రాజెక్టులో 3 ప్రాంతాల్లో దాదాపు 2.1 కిలోమీటర్ల మేరకు స్థానిక సమస్యలతో పనులు నిలిచిపోయాయి. స్థానికులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు చేపడతామని చెప్పారు.

**జోన్-3 సీవర్ నెట్ వర్క్ ప్రాజెక్టు**

మూసీనదికి ఉత్తరం వైపున కోర్ సిటీలో సీవరేజి వ్యవస్థ ఆధునీకరణ కోసం జోన్ - 3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు చేపడుతున్నారు. 4 నియోజకవర్గాల పరిధిలో 33.50 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణానికి సంబంధించి రూ.297 కోట్ల వ్యయంతో జోన్ - 3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టులో మొత్తం 129.32 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్ నిర్మాణాన్ని జలమండలి చేపడుతోంది. నగరంలోని ఓల్డ్ సిటీలో ఉన్న గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌తో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీవరేజి వ్యవస్థను ఆధునీకరించడానికి ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీజీఎం వినోద్ భార్గవ, జీఎం, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

**ఈడీ మయాంక్ మిట్టల్ సమీక్ష**

ఈడీ మయాంక్ మిట్టల్ ఓ అండ్ ఎం డివిజన్-9 కూకట్ పల్లి పరిధిలోని అన్ని సెక్షన్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన, ఓటీఎస్ పథకం తదితర అంశాలపై అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు.

## బీసీ సంఘాల సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** ఈ నెల 23 న ఉదయము 10:00 నుండి సాయంత్రము 4:00 గంటల వరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయములో బీసీ కమిషన్ ఆధ్వర్యములో తెలంగాణ రాష్ట్రములోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి బహిరంగ విచారణ చేపట్టడము జరుగుతున్నది. ఈ కార్యక్రమమును బీసీ కులాల వారు, బీసీ సంఘాల వారు సద్వినియోగము చేసుకోగలరని హైదరాబాద్ జిల్లా ఉప సంచాలకులు జి. ఆశన్న తెలియజేసారు.

# 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటోబంద్

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** గత 11 సంవత్సరాలుగా పెండింగ్‌లోవున్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కరంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ 2024 డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమ మానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి రాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి నేతలు బి.వెంకటేశం, (ఎఐటియుసి), పి. శ్రీకాంత్ (సిఐటియు), వి. ప్రవీణ్ (టియుసిఐ), ఎం.ఎ.సలీమ్ (యుటిఎడిడబ్ల్యుఎ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), వి. మారయ్య (బిఆర్.టియు) తోపాటు ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ వి.ఎస్.బోస్, బిఆర్.టియు అధ్యక్షులు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం 10 సంవత్సరాలు అధికారంలోఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా వారు ఇచ్చిన హామీలనే అమలు చేయకపోవడం దారుణం అని అన్నారు. రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని, మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని బి. వెంకటేశం డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీకాంత్ ,వి. ప్రవీణ్, వి. మారయ్య, ఎ.సత్తిరెడ్డి, ఎం.ఎ.సలీమ్, రాంబాబు యాదవ్, వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల డిమాండ్లు న్యాయమైనవని, కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సదస్సులో ఏ. బిక్షపతి యాదవ్, ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, ఎండి. ఒమర్ ఖాన్, చందు యాదవ్ (ఏఐటీయూసీ), లింగం గౌడ్ (టియుసిఐ), లక్ష్మణ్ (సిఐటియు), ఎండి. నజీర్ (యుటిఎడిడబ్ల్యుఎ) తదితరులు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్ : చైర్మన్

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు ,సంస్థలతో విజ్ఞాపనాలను స్వీకరించిన అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పట వరకు 7 విచారణలు పూర్తి చేయగా, ఇది 8వదని అన్నారు. ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బిసి కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం అని, దీనివల్ల రాష్ట్రంలో జనాభాలో బి సి లు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఇందులో 87,000 మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు ఇండ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్ లో లో పెట్టడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు 65 నుండి 70% సర్వే పూర్తయిందని, రంగారెడ్డి జిల్లాలో 79.6%, మేడ్చల్ మల్కాజ్ గిరి 65.3%, వికారాబాద్ 74.5% సర్వే పూర్తి చేయడం పట్ల ఆయన అభినందించారు. అదేవిధంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలో సైతం సర్వే బాగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లాల యంత్రంగాలను అభినందించారు. గురువారం నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా విశ్వకర్మ ,బ్రాహ్మణ, పూసల, రజక, కుమ్మర, కమ్మరి ,ఉప్పర అన్ని కుల సంఘాలు, ఇతర సంఘాల వారు వచ్చి వారి బాధలను, వారి కోరికలను విన్నవించుకున్నారన్నారు. ఈ బహిరంగ చర్చలో 72 పిటిషన్లు అందాయని తెలిపారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీ కమిషన్ బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, బట్రాజ్ తదితర కులాలను బీసీ డీ నుండి ఏ కి మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆ పేరు పిలవడం మానేసి వంశ రాజ్ గా మాత్రమే పిలవాలని విజ్ఞాపనలు వచ్చాయని వాటన్నిటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బీసీలకు అన్యాయం జరగరాదన్నదే బీసీ కమిషన్ బాధ్యతని, ఈ బాధ్యత నెరవేర్చడానికి తాము ఎంతైనా కృషి చేస్తామని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీలు మాట్లాడారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్, డి ఆర్ డి ఓ శ్రీలత, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ అధికారి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారులు,వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## స్వంత నిధులతో గుంతలు పూడ్చివేత

**విశాలాంధ్ర, మేడిపల్లి:** మేడిపల్లి నుండి పర్వతపూర్ వెళ్ళే మెయిన్ రోడ్డు పై పంచవటి కాలనీ మరియు గ్రీన్ ల్యాండ్ కాలనీ మధ్యలో చాలా పెద్ద పెద్ద గుంతలు పడడంతో గత రెండు మూడు నెలలుగా రోజు పోయే వేలాది వాహనదారులకు పాదాచారులకు ఇబ్బంది పడుతుండడం, అనేక వాహనాలు కింద పడిపోవడంతో యాక్సిడెంట్ అవ్వడంతో స్థానిక కాలనీవాసులు, ప్రజలు ఈ రోడ్డుపై ఉన్న గుంత ఇబ్బందిని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాంగ్రెస్ అధ్యక్షురాలు, సామాజిక కార్యకర్త శ్రీలత భద్రునాయక్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె వెంటనే స్పందించి తన సొంత డబ్బులతో గురువారం ఉదయం గుంతలను పూడ్పించి రోడ్డుపై మరమ్మత్తులు చేయించి స్వయంగా తాను గుంతలను పూడ్చి సమాజం కోసం నేను సైతం అంటూ చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకతీయ నగర్ కాలనీ అధ్యక్షురాలు శ్రీమతి భాగ్య లక్ష్మి శంకర్ రెడ్డి, నిర్మల, ఉమా, రాజు, బిక్షపతి పాల్గొన్నారు

## ఆలివ్ బై ఎంబసీతో హిల్టన్ ఒప్పందం

**విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ :** హైదరాబాద్ ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ కంపెనీ ఆసియా పసిఫిక్ బ్రాండ్ప రిచయం చేస్తూ భారతదేశం అంతటా 150 స్పార్క్ బైహిల్టన్ హెరీటల్ ను తెరవడానికి ఆలివ్ బై ఎంబసీ తో లైసెన్సింగ్ ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించింది. హిల్టన్ బెంగళూరు ఎంబసీ మాన్యతా బిజినెస్ పార్క్, హిల్టన్ గార్డెన్ ఇన్ బెంగళూరు ఎంబసీ మాన్యతా బిజినెస్ పార్క్ యజమానులైన ఎంబసీ గ్రూప్ దీర్ఘకాల భాగస్వామ్యం ఈ ఒప్పందం వచ్చింది. ఈ ఒప్పందం దక్షిణాసియాలో హిల్టన్ యొక్క ప్రతిష్టాత్మక వృద్ధిని బలపరుస్తుంది. శక్తివంతమైన భారతీయ మార్కెట్కు కొత్త ప్రీమియం ఎకానమీ బ్రాండ్ తీసుకువస్తుంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవా, కర్ణాటకఇంకా తమిళనాడులపై ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకుని దక్షిణ భారతదేశంలో మొదటి స్పార్క్ బై హిల్టన్ హెరీటల్‌ను విస్తృతంగా ఏర్పాటు చేయాలి నిర్వహించారు. దక్షిణాసియాలో హిల్టన్‌తో దీర్ఘకాల, ఆలివ్ ఎంబసీతో ఒప్పందం మంచి పరిణామం అని హిల్టన్- ఆసియా పసిఫిక్ అధ్యక్షుడు అలాన్ వాట్స్ అన్నారు. భారతీయ మార్కెట్లో పెద్ద, చిన్న నగరాల్లో డిమాండ్ ఉంటుంది అని ఆశిస్తున్నా అని అన్నారు.

## గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభం

**విశాలాంధ్ర కాప్రా :** హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించడం జరిగింది. చెరువులో నుంచి తీసిన గుర్రపు డెక్కను చెరువు కట్టపై వేయడంతో దోమల సమస్య యధావిధిగా ఉండడంతో జోనల్ కమిషనర్‌కి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ గుర్రపు డెక్కను ఇక్కడి నుంచి తరలించాలని కోరడంతో గురువారం గుర్రపు డెక్కను చెరువుకట్టపై నుంచి డంపు యార్డుకు తరలించే పనులను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే చెరువు కట్టపై పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించాలని రామ్కీ ఇన్చార్జ్ నవీన్ రెడ్డికి కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేకర్, మేకల ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, భూపాల్ రెడ్డి, మక్బూల్, ఆంజనేయులు, హెచ్ఎంటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పార్కింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

**విశాలాంధ్ర కాప్రా :** కుషాయిగూడ టీఎస్ ఐఐసీ కాలనీలోని పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనంలో అనాధికారికంగా ఏర్పాటు చేసిన పార్టీషన్లకు నోటీసులు జారీ చేస్తామని కుషాయిగూడ పారిశ్రామిక వాడ కమిషనర్ ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనాన్ని సందర్శించారు. ఈ భవనంలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయం, బ్యాంకు, ఇతర కంప్యూటర్ శిక్షణ సంస్థ తోపాటు డాక్యుమెంట్ రైటర్ల షట్టర్ల వద్దకు నిత్యం వేలాది ప్రజలు వస్తుంటారు, నిబంధనల విరుద్ధంగా పార్టిషన్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రెండు రోజుల క్రితం తాడూరి గగన్ కుమార్ ఫిర్యాదు చేయగా... ముఖ్యంగా పార్కింగ్ సౌకర్యం సైతం లేదని ఫిర్యాదులో పేర్కొనడంతో . గురువారం ఇండస్ట్రియల్ మున్సిపల్ అధికారులు తనిఖీ చేస్తూ నోటీసులు జారీ చేసి పార్టిషన్‌లను తొలగిస్తామని పార్కింగ్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన షట్టర్లు పార్టిషన్లను తొలగించే ప్రక్రియలో భాగంగా నోటీసులు ఇవ్వడానికి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. త్వరలోనే పార్టిషన్ల సమస్యతో పాటు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని కమిషనర్ ప్రభాకర్ అన్నారు.

## అక్రమ నిర్మాణాలను అరికట్టండి : సీపీఐ

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ :** కార్పొరేషన్ పరిధి ఆక్రమాలను, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు.గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను,అక్రమంగా రోడ్డు అక్రమనలను ఆపాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ.షాబీర్‌అలీ కి సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం పత్రం అందించారు. దీనిపై సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, జీ+2 పర్మిషన్ తీసుకొని జీ+4, జీ+5 బహుళ అంతస్థులు కడుతున్నారని, నిజాంపేట్ లో సర్వే నెంబర్ 90,94లో ఇలాంటి నిర్మాణాలు అనేకం జరిగాయని అప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ రావు వీటీ పై దృష్టి పెట్టకుండా ఆ అధికారం మా చేతుల్లో లేదు అని చేత్తులు ఏత్తేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే ఆదునుగా అక్కడి బిల్డర్లు రోడ్డును కూడా వదలకుండా రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రగతి నగర్ సాయి కీర్తి లేఔట్ ను అనుకోని వున్న రోడ్డును పూర్తిగా ఆక్రమించి అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నారు. పై వాటిపై మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేస్తే గతంలో వచ్చి కూల్చివేశారు. ఇప్పుడు ఏ కమిషనర్, అధికారులు స్థిరంగా లేకపోవడంతో కబ్జాదారులు ఇదే ఆదునుగా కబ్జాలకు పాల్పడుతున్నారని, వీటిని వెంటనే తొలిగించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రతిగటిస్తామని హెచ్చరించారు. సిపిఐ నాయకులు ఆశీ యాదయ్య, చంద్ర మోహన్ పాల్గొన్నారు.

**Notice**

**IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE: GUNTUR**
**M.V.O.P.No:579/ 2023**

**Between:**
**Nadimpalli Tulasinath** ... **Petitioner**
**And**
**Mr.Mohd Sadiq Ali & Others** ... **Respondents**

**To,**
**R-3:Md. Khaja @ Khaja Mohiddin, S/o. Nijamuddin,** Aged about 67 years, H.No.6-2-214, Hussainpura, Karkanaguda, KARIMNAGAR, (Driver of the Car No. AAX 1567)

పై నెంబరు ఓ.పి.ని పిటీషనర్ యాక్సిడెంటుకు నష్టపరిహారము కొరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో **3వ రెస్పాండెంట్** అయిన మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్తపత్రిక ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు **ది.13-12-2024**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిచో మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

**(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)**
వాయిదా తేది: **13-12-2024**

కె.శివప్రసాద్
పిటీషనర్ల తరపు న్యాయవాది, గుంటూరు,
సెల్: **9848119447**

## లోక్‌సభ ముందుకు వక్ఫ్ సహా 15 బిల్లులు

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ చట్టంతో పాటు మొత్తం 15 బిల్లులను కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. కోఆపరేటివ్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లు సహా ఐదు కొత్త బిల్లులు లిస్ట్ అయ్యాయి. పంజాబ్ కోర్టుల (సవరణ) బిల్లు, మార్చెంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, భారత పోర్టుల బిల్లు ఈ జాబితాలో ఉన్నాయి. వక్ఫ్ (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు 2024, గోవా రాష్ట్రం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్‌టీల ప్రాతినిధ్యం పునర్వ్యవస్థీకరణ బిల్లు-2024, రైల్వే సవరణ బిల్లు, బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు వంటి ఎనిమిది బిల్లులు లోక్‌సభలో పెండింగ్ ఉన్నాయి. అలాగే రాజ్యసభలో చమురు క్షేత్రాల నియంత్రణ- అభివృద్ధి సవరణ బిల్లు, బాయిలర్ల బిల్లు పెండింగ్ ఉన్నాయి. లోక్‌సభ ఆమోదిత భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు కూడా రాజ్యసభలో పెండింగ్ ఉన్నది. మొత్తంగా లోక్‌సభలో 15, రాజ్యసభలో 16 బిల్లులు ఈ సమా వేశాల్లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదిం చనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# అదానీతో ఒప్పందాలు రద్దు

### హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ ప్రభుత్వం అదానీ కంపెనీలతో చేసుకున్న అన్నిరకాల ఒప్పందాలను రద్దుచేయాలని, అదానీ అవినీతిపర్వంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అదానీ కంపెనీలతో జరిగిన విద్యుత్ ఒప్పందాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగినట్లు సీపీఐ ముందునుండీ ఆరోపిస్తున్నదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న అధికారులకు రూ.1750 కోట్లు లంచాలుగా ముట్టజెప్పడం ద్వారా అదానీ కంపెనీ లబ్ధిపొందినట్లు చెబుతున్నారని, అమెరికాలోని న్యూయార్క్ ఈస్టర్న్ జిల్లా కోర్టులో కేసు నమోదయిందంటే అదానీ అవినీతిపర్వం పరాకాష్టకు చేరినట్లుందన్నారు. గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, వినీత్‌జైన్, రంజిత్‌గుప్తా, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, రూపేశ్ అగర్వాల్‌లకు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదానీతో లాలూచీపడి, లొంగిపోయి పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు చేసుకుందన్నారు. రాష్ట్రంలోని ప్రజా ఆస్తులను అదానీకి అప్పనంగా కట్టబెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం చీకటి ఒప్పందాలకు పాల్పడినట్లు నాడు సీపీఐ చేసిన ఆరోపణలు నిజమని తేటతెల్లమైందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అదానీకి దోచిపెట్టడానికి జరిగిన ప్రయత్నాలన్నింటిపై సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. రూ.1750 కోట్లు లంచాలుగా తీసుకున్న అధికారులను తక్షణమే ఉద్యోగాల నుండి తొలగించి... కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాల వల్ల డిసెంబర్ నుండి రాష్ట్ర ప్రజలు రూ.6072 కోట్ల విద్యుత్ భారాలు మోయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.11,820 కోట్లను విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో మోపేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఒకపక్క చార్జీలు, పన్నుల భారాలు ప్రజలు మోస్తుంటే, మరోపక్క అధికారులు అవినీతికి పాల్పడి అదానీకి దాసోహమన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ కుంభకోణంతో సంబంధం ఉన్న ఆనాటి అధికారులు, రాజకీయ నాయకులు, మంత్రులు ఆఖరికి మాజీ ముఖ్యమంత్రి ప్రమేయం ఉన్నా... విచారణ జరిపించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వక్ఫ్ బిల్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో చుట్టుగుంట చంద్రం బిల్డింగ్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో ప్రముఖ న్యాయవాది అబ్దుల్ మతిన్ ప్రసంగిస్తూ వక్ఫ్ బోర్డు సంస్థ మనుగడకే ప్రమాద భరితంగా ఉన్న రాజ్యాంగ వ్యతిరేకమైన, కుట్రపూరితమైన సవరణలతో కూడిన వక్ఫ్ సవరణ చట్టం -2024ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముస్లిం సామాజిక వర్గం చైతన్యంతో కదలాలని తమ హక్కుల కోసం పోరాడాలని, వేదిక అండగా ఉంటుందన్నారు. సీనియర్ పాత్రికేయుడు షఫీ అహ్మద్, ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు బాబా, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిస్తీ, కాంగ్రెస్ నేత ఎస్కే బాజీ , ముస్లిం ఐక్యవేదిక నాయకులు సలావుద్దీన్, ఎస్కే. మస్తాన్, ఆలీ పాల్గొన్నారు.

# మాటల్లేవ్...చేతలే

- నేరాలు చేసేవారిని వదిలిపెట్టం
- జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై సీఎం చంద్రబాబు శాసనసభలో కీలక వ్యాఖ్యలు చేశారు. పీడీ యాక్ట్‌తో పాటు పోలీసు వ్యవస్థ బలోపేతం, మహిళా భద్రత గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారి ముసుగు తొలగించి కఠినంగా శిక్షిస్తామని, తప్పు చేసిన వారిని ఎవరినీ వదలబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను మెరుగుపర్చేందుకు, నేరాలను అరికట్టేందుకు పీడీ యాక్ట్‌కు పదును పెట్టామన్నారు. శాంతి భద్రతలపై పటిష్ట చర్యలు తీసుకోవడం తనకు కొత్త కాదని అన్నారు. 1995లో హైదరాబాద్‌లో మత కలహాలు, రాయలసీమలో ముఠా (ఫ్యాక్షన్) తగదాలు, ఆంధ్రప్రాంతంలో రౌడీ రాజకీయాల్ని కట్టడి చేశామని గుర్తు చేశారు. తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లో అధ్యయనం చేసి కొత్త చట్టంలో వివిధ అంశాలు చేర్చామన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, భద్రత లేకపోతే రాష్ట్రానికి పర్యాటకులు కూడా రాని పరిస్థితి తలెత్తుతుందని అన్నారు. కొంత మంది సీనియర్ అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ పోలీసు వ్యవస్థకే మచ్చ తెచ్చారని, వారిని సస్పెండ్ చేయడం జరిగిందని వివరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టానుసారం ప్రవర్తిస్తే... ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. ఆడబిడ్డల జోలికి వస్తే ఏమి చేస్తానో చేసి చూపిస్తానని అన్నారు. నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా చర్యలుంటాయని హెచ్చరించారు. పోలీసులు ప్రజాహితం కోసం పనిచేయాలని చంద్రబాబు సూచించారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 6,100 మంది పోలీసు కానిస్టేబుళ్లను నియామకం చేస్తామని, పోలీసు ఫోర్స్ ఆధునికీకరణకు రూ.61 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. రూ.99 కోట్లు కేంద్రం నుంచి తీసుకొస్తున్నామని తెలిపారు. పోలీసులకు 2,812 కొత్త వాహనాల కోసం రూ.280 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. పోలీసు సంక్షేమం కోసం రూ.20 కోట్లను విడుదల చేశామని తెలిపారు. పోలీసు అమరవీరులను స్మరించుకునేందుకు రాజధానిలో ఐదు ఎకరాల భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఫోరెన్సిక్ ల్యాబ్‌లను కూడా పెడతామని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టంతో మోసాలు, అక్రమాలకు తెరదీశారని ఆరోపించారు. నోటీసు ఇవ్వకుండా భూ యజమాని పేరు మార్చేలా చట్టం తీసుకొచ్చారని.. కింది స్థాయి కోర్టుల్లో ఫిర్యాదులకు తావు లేకుండా నేరుగా హైకోర్టుకు వెళ్లే పరిస్థితి కల్పించారంటూ తప్పుబట్టారు. ఫిర్యాదుల విభాగానికి ఎక్కువగా భూ ఆక్రమణలకు సంబంధించినవే వచ్చాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలను అధ్యయనం చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. గ్రామాలు, పట్టణాలు సహా ఎక్కడైనా సరే భూమి కబ్జా చేస్తే ఈ చట్టం వర్తిస్తుందని అన్నారు. కొత్త చట్టం ప్రకారం భూ కబ్జా చేసినా, కబ్జాకు ప్రయత్నించినా, బెదిరించినా శిక్షకు గురవుతారని హెచ్చరించారు. భూ కబ్జా చేస్తే 10 నుంచి 14 ఏళ్ల జైలు శిక్ష విధించేలా చట్టం తెచ్చామని వివరించారు. భూకబ్జా కేసుల విచారణ కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్లను పెడుతున్నామన్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేక కోర్టులు పెట్టి ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి కబ్జాదారులపై శిక్ష విధించేలా చట్టం తీసుకొచ్చామని వెల్లడించారు.

## కసబ్‌కూ అవకాశమిచ్చాం

### యాసిన్ మాలిక్ కేసులో సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: వేర్పాటువాది యాసిన్ మాలిక్‌ను కోర్టులో వ్యక్తిగతంగా హాజరుపర్చాలన్న ఆదేశాల మేరకు సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. మన దేశంలో ఉగ్రవాది అజ్మల్ కసబ్ కేసు విచారణ కూడా న్యాయబద్ధంగానే జరిగిందని గుర్తుచేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా చేయగలమని ప్రశ్నించింది. 1990లో శ్రీనగర్ శివారులో నలుగురు వైమానిక సిబ్బంది హత్య కేసు, 1989లో రుబయా సయీద్ (అప్పటి హోంమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ కుమార్తె) కిడ్నాప్ కేసులో వేర్పాటువాది యాసిన్ మాలిక్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసుల విచారణకు మాలిక్ వ్యక్తిగతంగా హాజరుకావాలని జమ్మూ కోర్టు గతంలో ఆదేశించింది. అయితే, ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం జమ్మూ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. తాజాగా గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... 'భద్రతా కారణాల రీత్యా మాలిక్‌ను జమ్మూకు తీసుకెళ్లలేం. సాక్షుల భద్రత కూడా మాకు ముఖ్యమే. గతంలో ఓ సాక్షిని హత్య చేశారు. న్యాయవాదిని పెట్టుకోకుండా మాలిక్ గిమ్మిక్కు చేస్తున్నాడు. అతడు సాధారణ క్రిమినల్ కాదు. లష్కరే తోయిబా వ్యవ స్థాపకుడు హఫీజ్ సయీద్‌తో అతడికి సంబంధాలున్నాయి.

## త్వరలో టెక్స్‌టైల్స్ విధానం

### చేనేతలకు 90 శాతం సబ్సిడీతో పనిముట్లు: మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన టెక్స్‌టైల్స్ విధానాన్ని త్వరలో తెస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కుపై టీడీపీ ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. చేనేతలకు 90 శాతం సబ్సిడీతో పనిముట్లు అందజేస్తామన్నారు. '2015, ఆగస్టు 15న ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 90 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ హయాంలో అన్ని రంగాల మాదిరిగా చేనేత రంగం కూడా నిర్వీర్యమైంది. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్కులో 14 ఎకరాలను వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం కేటాయించింది. దీనిపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చి... టెక్స్‌టైల్స్ పార్కు భూములను కాపాడాం' అని మంత్రి చెప్పారు. 2014-19లో నాటి చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు కాబోతున్నదన్నారు. తద్వారా ఐదువేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి చెప్పారు. రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్‌తో పాటు టెక్స్‌టైల్స్ పార్కు నిర్మించనున్నట్లు తెలిపారు. మంగళగిరిలో వీవర్‌శాల ఏర్పాటు చేసి చేనేతలకు మంత్రి లోకేశ్ అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా వీవర్‌శాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు. వీవర్‌శాలల ఏర్పాటుకు కొందరు ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధులిచ్చేందుకు ముందుకొచ్చారన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి సంస్థల సాయంతో రాష్ట్రంలో వీవర్ శాలలు, కస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి చెప్పారు.

## చెత్త పన్నుపై విచారణ చేయిస్తాం: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ పాలనలో చెత్త పన్ను వసూళ్లు, కాంట్రాక్టుల్లో అక్రమాలపై విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. చెత్త పన్నుపై చట్టంలో వైసీపీ ప్రభుత్వం చేసిన మార్పులను తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకోసమే మున్సిపల్ కార్పొరేషన్స్ యాక్ట్-1955లోని సెక్షన్ 491-ఏ, ఏపీ మున్సిపాల్టీల చట్టం-1965లోని 170బీలు తొలగిస్తూ సవరణ బిల్లును ప్రతిపాదించినట్లు నారాయణ వెల్లడించారు. మున్సిపల్ చట్ట సవరణ బిల్లును నారాయణ ప్రతిపాదించగా, కొద్దిసేపు చర్చ తర్వాత సభ దీనిని ఆమోదించింది. చెత్తపై వినియోగ రుసుము రద్దు చేస్తూ రాష్ట్రంలో 40 మున్సిపాలిటీల్లో సర్వీసు ప్రొవైడర్ల ద్వారా చెత్త సేకరించేందుకు వీలుగా 2020లో మున్సిపల్ చట్టంలో వైసీపీ ప్రభుత్వం సవరణలు చేసిందన్నారు. 2021 నవంబరు నుంచి చెత్తపన్ను వసూలు చేసిందని, నెలకు ఒక్కో చెత్త వాహనానికి రూ.51,641 నుంచి రూ.62,964 వరకు చెల్లించిందని తెలిపారు. 2021 నవంబరు నుంచి 2024 జూలై వరకూ రూ.325 కోట్లు బిల్లు అయితే రూ.249 కోట్లు చెల్లించారన్నారు. చెత్త పన్ను 188 కోట్లు వసూలు చేసినట్లు గత ప్రభుత్వం చూపించిందనీ, మొత్తం రూ.325 కోట్లకుగాను మిగిలిన డబ్బు చెల్లించేందుకు స్వచ్ఛ భారత్ నుంచి రూ.90.19 కోట్లు, హౌసింగ్ బోర్డు నుంచి రూ.32.55 కోట్లు, డీటీసీపీ నుంచి రూ.9.6 కోట్లు, రాజీవ్ స్వగృహ నుంచి రూ.4.56 కోట్లు అప్పు తీసుకున్నాదని నారాయణ తెలిపారు. కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చే ఉద్దేశంతోనే ఇతర విభాగాల నుంచి అప్పులు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. చెత్తపన్ను, అప్పులపై విచారణ చేయిస్తామని నారాయణ అన్నారు.

## గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు కోరారు. శాసన మండలిలో గురువారం సభ్యుల ప్రత్యేక ప్రస్తావనలు(స్పెషల్ మెన్షన్స్), ప్రభుత్వ తీర్మానం, ప్రభుత్వ బిల్లులను శాసన మండలి ఆమోదించింది. ఈ అంశాలపై మంత్రులు, సభ్యులు మాట్లాడారు. పీడీఎఫ్ సభ్యుడు ఇళ్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో 2018-19లో పీజీటీ తెలుగు భాషా బోధనకు 140 మందిని నియమించారని, జూన్, 2022లో వారిని విధుల నుంచి తొలగించి తిరిగి కొంత మందిని విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. సభ్యుడు పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ 2019 నుంచి 2021 వరకు పెండింగ్ ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల జీతభత్యాలను చెల్లించాలని అప్పటి ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. ఎంపీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 2004లో పెన్షన్ విధానం ఓపీఎస్ నుంచి సీపీఎస్‌కు మార్చడంతో ఉద్యోగులు వ్యతిరేకించారని, గత ప్రభుత్వం ఓపీఎస్ స్థానంలో సీపీఎస్‌ను ప్రవేశపెట్టిందని, కానీ ప్రస్తుతం ఉద్యోగులు ఓపీఎస్‌ను కోరుకుంటున్నారని తెలిపారు. శాసనమండలి సభ్యురాలు కల్పలత మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేసి కనీస వేతనం చెల్లింపును అమలు చేయాలని కోరారు. నర్తు రామారావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్లో రోగికి ఒక మంచం కేటాయించాల్సి ఉండగా, ఒక మంచాన్ని ముగ్గురు రోగులకు కేటాయిస్తున్న దుస్థితి నెలకొందన్నారు. చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని కానిస్టేబుళ్లకు జోనల్ ప్రాతిపదికగా బదిలీలు చేయాలని, వారికి పదోన్నతులు కల్పించాలని, పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తొలుత అసెంబ్లీలో ఆమోదం పొందిన నాలుగు బిల్లులను మండలి ఆమోదించినట్లు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రకటించారు.

# విశాఖ ఉక్కుపై నిలదీయండి

### ఎంపీలకు జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... తన పార్టీ ఎంపీలతో సమావేశమయ్యారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో తనూజా రాణి, మేడా రఘునాథ రెడ్డి, గొల్ల బాబూరావుతో కలిసి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, కీలక అంశాలను పార్లమెంటు ఉభయ సభల్లో లేవనెత్తుతామని చెప్పారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలన్న నిర్ణయం వల్ల కలిగే నష్టాన్ని ప్రస్తావిస్తామన్నారు. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని ప్రధానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, ఢిల్లీలో ధర్నాకు దిగుతామన్నారు. దీనిపై మా పార్టీ అధినేత జగన్ స్పష్టంగా సూచించారని వివరించారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా సాధించే విషయంలో ఏ మాత్రం వెనకడుగు వేయబోమని, రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక సాకారమయ్యేలా మా వంతుగా గట్టిగా ప్రయత్నిస్తామన్నారు. వక్ఫ్ బిల్లుపై పట్టుదలగా ఉన్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బిల్లును ఆమోదించే ప్రసక్తి లేదన్నారు. మనది సెక్యులర్ దేశమని, వక్ఫ్ బిల్లుతో దానికి అర్థం లేకుండా చేస్తే.. ముస్లిం మైనార్టీల తరపున అవసరమైతే పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు నాటి నుంచి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల విధ్వంసం, హత్యలు, హత్యా యత్నాలు కొనసాగుతున్నాయని వివరించారు. సోషల్ మీడియా పోస్టులు సాకుగా చూపుతూ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి దారుణంగా వేధిస్తున్నారని, పోలీస్ కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని తెలిపారు. టీడీపీకి చెందిన సోషల్ మీడియా పెడుతున్న దారుణమైన పోస్టులపై మా పార్టీ నాయకులు సాక్ష్యాధారాలతో సహా ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు స్పందించడం లేదని, కనీసం కేసు కూడా నమోదు చేయడం లేదన్నారు. వీటిని కూడా పార్లమెంటులో ప్రస్తావిస్తామని, కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు, చట్ట విరుద్ధమైన అరెస్టుల వ్యవహారాన్ని జాతీయస్థాయిలో అన్ని పార్టీల దృష్టికి తీసుకెళ్తామని సుభాష్‌చంద్రబోస్ చెప్పారు.

## 5,791 మంది హమాలీలకు లబ్ధి: నాదెండ్ల

### కూలి రేటు రూ.25 నుంచి 28కి పెంపు... ఐక్యవేదిక నేతలతో ఒప్పందం

విశాలాంధ్ర-విజయవాడ: పౌర సరఫరాలశాఖలో పని చేస్తున్న హమాలీల కూలి రేటు రూ.మూడు పెంచడం ద్వారా 252 ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో పని చేస్తున్న 5,791 మంది ముఠా కార్మికులకు లబ్ది చేకూరుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కూలి రేటు పెంచాలని జేఏసీ నాయకుల అభ్యర్థన మేరకు ఐక్యవేదిక నాయకులతో వెలగపూడి సచివాలయం రెండో బ్లాక్ లోని తన ఛాంబర్ లో మంత్రి గురువారం సమావేశం అయ్యారు. కూలి రేటు క్వింటాకు రూ. 25 నుంచి రూ. 28కి పెంచేందుకు మంత్రి అంగీకారం తెలిపారు. జేఏసీ నాయకులు అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా... సావధానంగా విన్న ఆయన మరో సమావేశంలో సమస్యలపై లోతుగా చర్చించి పరిష్కరిద్దాం అన్నారు. హమాలీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూలి రేటు పెంచిందన్న విషయం గుర్తుచేశారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్, ఎండీ మన్‌వీర్ జిలానీ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, సీఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావు, రాష్ట్ర నేతలు శేఖర్, శివ శంకర్, పీవీమోహన్, ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు కోట్ల మరియదాసు, బండారు శ్రీను బాబు , భాష, లక్ష్మణ్ రావు, అనిల్ పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలపై వైసీపీ నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యంగ్యంగా ఇచ్చిన సమాధానం తీవ్ర దుమారం రేపింది. గురువారం వైసీపీ సభ్యుడు పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ 'వంద ఎలుకలు తిన్న పిల్లి..హజ్‌యాత్రకు వెళ్లినట్లు అని'.. ఉర్దూలో సామెత చెప్పి తన వివరణ చెబుతుండగా..వైసీపీ సభ్యులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. ఒక మతాన్ని అవమానించే విధంగా మంత్రి మాట్లాడారని, మైనార్టీలకు క్షమాపణ చెప్పాలని, ఆ మాటలను రికార్డుల నుంచి తొలగించాలని సభ కార్యక్రమాలకు అడ్డుపడ్డారు. దీంతో కూటమి, వైసీపీ సభ్యులు పరస్పరం విమర్శలు చేసుకున్నారు. వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు వచ్చి నిరసనకు దిగారు. తక్షణమే మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుపట్టారు. దీంతో చైర్మన్ మండలిని ఐదు నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ నేను మాట్లాడిన మాటల్లో ఏమైన తప్పు ఉంటే రికార్డుల నుంచి తొలగించాలని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. రాష్ట్రానికి ఇస్తామన్న ఎంబీబీఎస్ సీట్లను వద్దని జాతీయ వైద్య మండలికి ప్రభుత్వం ఎటువంటి లేఖ రాయలేదని మంత్రి సత్యకుమార్ తేల్చి చెప్పారు. నూతన కళాశాలల్లో మౌలిక సదుపాయాల లోటుపాట్లు, తరగతులు ప్రారంభించడానికి ఫ్యాకల్టీ కొరతగా ఉండటం వాస్తవమేనన్నారు. ప్రతి వైద్య కళాశాలకు దాదాపు రూ.600 కోట్ల మూలధన పెట్టుబడి, ప్రతి సంవత్సరం రూ.135 కోట్ల ఆవృత వ్యయం అవసరమవుతుందని వివరించారు. విశాఖ తీరంలో వాయు కాలుష్యంపై దువ్వారపు రామారావు, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి..అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక మంత్రి పవన్ కళ్యాణ్ సమాధానమిస్తూ... విశాఖలో వాయు కాలుష్య స్థాయి నిర్దిష్ట ప్రమాణాల కంటే 1.43 రెట్లు ఎక్కువ ఉందన్నారు. జనవరి నుంచి సెప్టెంబర్ (2024) వరకు విశాఖ గాలి నాణ్యత క్యూబిక్ మీటరుకు సగటున 86 మైక్రోగ్రాముల సాంద్రతను చూపిస్తోందని... ఇది కేంద్ర పర్యావరణ శాఖ నోటిఫై చేసిన ప్రమాణాల (క్యూబిక్ మీటరుకు 60 మైక్రో (గ్రాములు) కంటే సుమారు 1.43 రెట్లు ఎక్కువ ఉందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషను 2022 నుంచి 2024 వరకు రూ.19.15 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు.

## కెనడా తీరు హాస్యాస్పదం

### మోదీపై ప్రచారానికి భారత్ ఖండన

న్యూఢిల్లీ: కెనడాపై భారత ప్రభుత్వం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖలీస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు జరిగిన కుట్ర గురించి ప్రధాని మోదీకి ముందే తెలుసు అంటూ కెనడాకు చెందిన 'ది గ్లోబ్ అండ్ మెయిల్' వార్తా పత్రిక ఓ కథనం రాసుకొచ్చింది. ఈ కథనాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. అలాంటి అర్థం లేని కథనాలను కొట్టిపారేస్తున్నామని పేర్కొంది. కెనడా కథనంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ... 'మేము సాధారణంగా మీడియాలో వచ్చే కథనాలపై స్పందించం. కానీ, కెనడా ప్రభుత్వ వర్గాలను ఉద్దేశిస్తూ వెలువడిన ఈ హాస్యాస్పద వార్తలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. నిరాధారమైన ఇలాంటి వార్తలు సరికాదు. ఇలాంటి వార్తలపై అధికారులు కచ్చితంగా జవాబు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి తప్పుడు ప్రకటనలు, ప్రచారాలు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా తప్పుడు వార్తలు ప్రచురించకపోవడం మంచిది' అని గట్టిగా చెప్పారు. ఈ హత్యకు కుట్రలో భారత జాతీయ భద్రతా సలహాదారు, విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా భాగమైనట్లు తమకు తెలిసిందని కెనడా సీనియర్ జాతీయ భద్రతా అధికారి ఒకరు చెప్పినట్లు ఆ కథనం పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా... గత సంవత్సరం, నిజ్జర్ హత్యతో భారత ప్రభుత్వ ఏజెంట్లకు సంబంధం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన తర్వాత రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. కెనడా వాదనలు నిరాధారమైనవని తెలిపింది. నిజ్జర్ హత్య జరిగినప్పటి నుంచి కెనడా... భారత ప్రభుత్వం, మోదీపై తప్పుడు ప్రచారం చేస్తూనే ఉంది. అంతకుముందు కెనడాకు చెందిన కొంతమంది నేతలు అమిత్ షా లక్ష్యంగా ఆరోపణలు చేశారు.

## పాక్‌లో కాన్వయ్‌పై ఉగ్రదాడి

పెషావర్: వాయువ్య పాకిస్థాన్‌లో తీవ్రవాదులు రెచ్చిపోయారు. ప్రయాణికుల వాహనాలపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 50 మంది చనిపోగా మరో 20 మందికి గాయాలయ్యాయి. ఈ మేరకు అధికారులు గురువారం తెలిపారు. అఫ్గాన్‌తో పంచుకునే సరిహద్దు వెంబడి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం జిల్లాలో ఈ దాడి జరిగిందని చెప్పారు. పరాచినార్ నుంచి పెషావర్‌కు వెళ్లే కాన్వాయ్‌ను సాయుధులు ముట్టడించి దాడి చేశారన్నారు. మృతుల్లో ఐదుగురు పిల్లలు, ఎనిమిది మంది మహిళలు ఉన్నారని, బాధితుల్లో చాలా వరకు షియా వర్గీయులని తెలిపారు. ఈ కాన్వాయ్‌లో మొత్తం 200 వాహనాలు ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. తాజా ఘటనపై ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ ఖాన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రావిన్స్‌లోని అన్ని మార్గాల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రావిన్షియల్ హైవేస్ పోలీస్ యూనిట్ నెలకొల్పాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. అమాయకులను లక్ష్యంగా చేసుకోవడం ఆక్షపణీయమని, దోషులను ఉపేక్షించబోమని సీఎం అలీ అమీన్ ఖాన్ తేల్చిచెప్పారు.

## రాయలసీమ ద్రోహి చంద్రబాబు: గడికోట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మా ప్రాంత సంస్థలన్నీ అమరావతికి తరలిస్తున్నారని, శ్రీబాగ్ ఒడంబడికను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. అన్ని విధాలుగా రాయల సీమకు అన్యాయం చేసిన సీఎం చంద్రబాబు ఆ ప్రాంత ద్రోహిగా మిగిలిపోతారని మండిపడ్డారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని సైతం యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కర్నూలులో శంకుస్థాపన చేసిన లా యూనివర్సిటీని తరలించడం సరికాదన్నారు. భవిష్యత్తులో రాయలసీమ కోలుకోని విధంగా తమ ప్రాంతాన్ని నాశనం చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. రాయల సీమకు చెందిన మంత్రితోనే రాయలసీమకు హైకోర్టు వద్దు... బెంచ్ చాలు అని తీర్మానం చేయించి రాయలసీమను ఉద్ధరించానని చెప్పడం చూసి ఈ ప్రాంత వాసిగా బాధపడుతున్నానని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.